

పెద్దఎడ్లగాడి నుంచి పెనుమాకలంక గ్రామానికి కొల్లేరు వరద ఉధృతిలో రేకు పడవపై ప్రయాణిస్తున్న ప్రజలు

తగ్గుతున్న కొల్లేరు వరద

కైకలూరు, మండవల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కొల్లేరు క్రమేపీ తగ్గుముఖం పడుతోంది. కొద్ది కొద్దిగా రహదారులు వరద నుంచి బయటపడుతున్నా సరస్సులో నీరు ఉధృతంగానే ప్రవహిస్తోంది. భారీగా చేరిన గుర్రపుడెక్క ప్రస్తుతం రహదారులను మూసివేసింది. ఆ ముంపులోనే లంక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ రేకు పడవలపై ప్రయణిస్తున్నారు. మండవల్లి మండలం పెద్దఎడ్లగాడి నుండి పెనుమాకలంక, ఇంగిలిపాకలంక గ్రామాలకు వెళ్లే ప్రజలు ఈ దుస్థితిని ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు సైతం ఈ పడవల్లోనే ప్రయాణం చేస్తున్నారు. కైకలూరు మండలం ఆటపాక, గోనెపాడు, చటాకాయ గ్రామాల్లోని సర్కారుకాలువ వద్ద ఉధృతంగా కొల్లేరు ప్రవహిస్తోంది.

వరద నివారణ చర్యలను చేపట్టాం : ఎమ్మెల్యే కామినేని



పెద్దఎడ్లగాడి పెనుమాకలంక రహదారి వద్ద వరద ఉధృతిని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. పెద్దఎడ్లగాడి వంతెనపై ఎక్స్‌కవేటర్‌తో గుర్రపుడెక్కను తొలగించే పను లను ఆయన పరిశీలించారు. గుర్రపుడెక్కను తొలగించేందుకు ప్రభుత్వం నుంచి నిధులు రాక పోయినా తన సొంతసొమ్ముతో పనులు నిర్వహిస్తున్నామన్నారు. కొల్లేరుతో పాటు నియోజక వర్గం లోని అనేక డ్రెయిన్లను ఇప్పటికే ఆధునికీకరణ చేశామని భారీవర్షాలకు సైతం ముంపు లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఆయన వెంట ఎంపీపీ అడవి కృష్ణ, రాష్ట్ర రాష్ట్ర చేపల రైతు సంఘం అధ్యక్షుడు తాడినాడ బాబు, వడ్డీసాధికారిక సమితీ కన్వీనర్ బలే ఏసురాజు, రాష్ట్ర తెలుగుయువత కార్య నిర్వహణ కార్యదర్శి పూల రామచంద్రరావు, బీజేపీ నాయ కుడు బోయిన శ్రీనివాసరావు, నీటి సంఘాల నాయకులు బొల్లంపల్లి కృష్ణారావు, చదలవాడ శ్రీమన్నారాయణ, జనసేన నాయకుడు కొల్లి బాబు, రూరల్ సీఐ రవికుమార్, టౌన్ ఎస్ఐ శ్రీను, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.





వేలేరుపాడు మండలంలో పొలాలను ముంచివేసిన గోదావరి వరద

గోదావడి వడిగా..

- భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- వరద ఉధృతికి లోతట్టు ప్రాంతాలు జలమయం
- విలీన మండలాల్లో గ్రామాలు ఖాళీ చేస్తున్న ప్రజలు
- అధికారుల అప్రమత్తం.. వరద ప్రాంతాల్లో పర్యటన

కుక్కునూరు/వేలేరుపాడు/పోలవరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద పెరుగుతోంది. భద్రాచలం వద్ద నీటిమట్టం బుధవారం రాత్రి పది గంటల సమయంలో 48 అడుగులు దాటడంతో రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. వరద మరింత పెరిగి మూడో ప్రమాద హెచ్చరిక 53 అడుగులకు చేరుకునే అవకాశం ఉంది. గోదావరి ఎగువ భాగం నుంచి భారీగా వరద నీరు చేరుకోవడంతోపాటు శబరి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు చేరింది. కుక్కునూరు-దాచారం మధ్య ఉన్న గుండేటివాగులో లెవల్ కాజ్‌వేతో పాటు ప్రధాన రహదారి వరద ముంపునకు గురైంది. పాలవాగు కల్వర్టు నీటమునిగింది. దీంతో వయా నల్లగుంట మీదుగా మాధవరం మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. వరద ఇలానే పెరిగితే వేలేరుపాడు మండలం రేపాకగొమ్ముకు రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉండటంతో గ్రామస్థులు గ్రామాన్ని ఖాళీ చేస్తున్నారు. ఇళ్లలోని సామాన్లను ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా ఆర్అండ్ఆర్ కాలనీలు దాచారం, చల్లవారిగూడెం తరలిస్తున్నారు. పోలవరం వద్ద గోదావరిలో నీటిమట్టం అనూహ్యరీతిలో పెరిగింది. పట్టిసీమ శివక్షేత్రాన్ని వరద జలాలు ఆక్రమించాయి.

946 కుటుంబాలకు పునరావాసం

ఏలూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో పొంచి ఉన్న వరద ముప్పును అధిగమించడానికి సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ. 'గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, భద్రాచలం నుంచి వస్తున్న వరద నీటితో రెండో ప్రమాద హెచ్చరికకు దగ్గరగా ఉన్నామని, అయినా ఎదుర్కోవడానికి పటిష్ట యంత్రాంగాన్ని సిద్ధం చేశాం. కుక్కునూరులో రెండు గ్రామాలు వరద ప్రభావంలో ఉండగా మరో రెండు గ్రామాల్లో ఇబ్బంది ఉంది. వేలేరుపాడులో 15 గ్రామాల్లో వరదతో ఇబ్బంది ఉంది. 946 కుటుంబాలకు పునరావాసం కల్పించడానికి (మిగతా 8వ పేజీలో)



అధైర్యపడొద్దు.. అండగా మేమున్నాం : కలెక్టర్

- కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ బుధవారం వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని దాచారం, కటుకూరు, యర్రతూగు, బోళ్లపల్లి, తదితర లోతట్టు గ్రామాల ప్రజలను కలెక్టర్, జేసీ కోరారు. రేపాకగొమ్ము గ్రామస్థులను పునరావాస కాలనీలకు తరలిస్తున్న క్రమంలో అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులు ఆదేశించారు. ఆర్డీవో రమణ, డీఆర్‌డీఏ పీడీ విజయ రాజు, పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ చలపతిరావు, ఎంపీడీవో శ్రీహరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వరద పరిస్థితి ఎదుర్కొనేందుకు సిద్ధం : ఎస్పీ

- వేలేరుపాడులోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశాలున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ శివకిశోర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రేపాకగొమ్ములో బుధవారం ఆయన పర్యటించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ రమేశ్‌బాబు, ఎస్ఐ నవీన్ కుమార్ ఉన్నారు.



అలా గండ్లు కొడితే..ఇలా పూడ్చేస్తున్నారు..!



అక్రమ చెరువులకు గండ్లు కొడుతున్న దృశ్యం

కలిదిండి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉప్పుటేరు వెంబడి అక్రమ చేపల, రొయ్యల చెరువులను అధికారులు ఎక్స్‌కవేటర్లతో తొలగిస్తున్నారు. కొందరు ఉప్పుటేరు వెంబడి ఉన్న మార్జిన్‌లో చెరువులు తవ్వి చేపలు, రొయ్యలు సాగు చేస్తున్నారు. అధికారులు ఆక్రమణదారులకు ముందస్తుగా సమాచారం ఇచ్చి చెరువుల వద్ద ఎర్ర జెండాలను పాతి మార్కింగ్ ఇచ్చి ఆపై గండ్లు కొడుతున్నారు. దీంతో చెరువుల్లో చేపలను, రొయ్యలను హడావుడిగా పట్టుబడి చేస్తున్నారు. చినతాడి, విభరాం గ్రామాల్లో రెండు ఎక్స్‌కవేటర్లతో అక్రమ చెరువులకు గండ్లు కొడుతున్నారు. తాడినాడ, సున్నంపూడి, దుంపలకోడు దిబ్బ కొండంగి, పల్లి పాలెం, మట్టగుంట, పెదలంక గ్రామాల్లో ఆక్రమణల తొలగింపునకు ఇప్పటికే సమాచారం ఇచ్చారు. దీంతో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. అక్రమ చెరువుల్లో అధికంగా పండుగప్ప సాగు చేస్తున్నారు. పట్టుబడి రాకపోవడంతో ఏమీ చేయాలో దిక్కు తోచక తలలు పట్టుకుంటున్నారు. చిన్న సైజు రొయ్యలు, చేపలను ఎలా అమ్ము కోవాలంటూ ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా చినతాడినాడలో ఉప్పుటేరు వెంబడి అక్రమ చెరువులను పూర్తిగా తొలగించకుండా గట్లకు చిన్న గండి పెట్టడంతో మరుసటి రోజు మళ్లీ ఆక్రమణదారులు పూడ్చివేసి యథావిధిగా సాగు చేసుకుంటున్నారనే విమర్శలు వినిపి స్తున్నాయి. ఈవిషయమై డ్రెయినేజీ శాఖ డీఈఈ వినోద్ చంద్ ను వివరణ కోరగా.. 'గండ్లు మరల పూడ్చు తున్నట్టు మా దృష్టికి వచ్చింది. చెరువుల గండ్లు పూడ్చిన వారిపై కేసులు పెడతాం. పూడ్చిన గండ్లు, చెరువులను పూర్తిగా తొలగిస్తాం' అన్నారు.



తిరిగి అక్రమ చెరువుల గండ్లు పూడ్చిన దృశ్యం

గిరిజనుల సాధికారతకు ఆదికర్మ అభయాన్ : కలెక్టర్

ఏలూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):గిరిజన జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ఆదికర్మ యోగి అభయాన్ కార్యక్రమాన్ని తొమ్మిది మండలాల్లో 46 గ్రామాల్లో అమలు చేస్తున్నామని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం, టి.నర్సాపురం, నూజివీడు, చాట్రాయి, చింతలపూడి మండలాల్లో ఈ కార్యక్రమం అమలవుతోందన్నారు. ఇప్పటికే పథకం అమలుపై శిక్షణ పూర్తి చేశామని సేవా సమర్పణ్, సంకల్పం ద్వారా పరిపాలన వారికి అందించి చిట్టచివర గిరిజన ప్రాంతానికి సేవలు వ్యాప్తి చేస్తామన్నారు.

4,200

- జిల్లాలో అనర్హత దివ్యాంగ పింఛన్ల సంఖ్య
- మొత్తం దివ్యాంగుల పింఛన్లు 33,500
- సదరం వైద్యులచే ఇప్పటివరకు 28 వేల పింఛన్ల పరిశీలన
- ఆరోగ్య సమస్యలతో ఇచ్చే వాటిలో182 పూర్తిగా అనర్హత
- రద్దయిన వారికి అప్పీలు చేసుకునే అవకాశం



ఏలూరుసిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్‌లకు సంబంధించి సదరమ్ సర్టిఫికేట్లను పరిశీలన చేస్తున్నారు. ఈ పరిశీలనలో అర్హులు, అనర్హులను గుర్తిస్తున్నారు. గతంలో అనర్హులు దివ్యాంగ పింఛన్‌లు పొందుతున్నారనే ఆరోపణలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం సదరం రీ అసెస్‌మెంట్ చేస్తున్న సంగతి విదితమే. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిలోను కొన్ని పింఛన్‌లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయనే విమర్శలతో వాటిని పరిశీలిస్తున్నారు. ఈ మేరకు జిల్లాలోని దివ్యాంగుల పింఛన్ లబ్ధిదారులకు సదరం డాక్టర్లు పరీక్షలు నిర్వహించారు. అంగవైకల్యం తక్కువగా ఉన్న లబ్ధిదారులను అనర్హులుగా గుర్తించి పింఛన్ రద్దు చేస్తూ నోటీసులు ఇచ్చారు. అయితే వారు అప్పీలు చేసుకునే అవకాశం కల్పించారు. తిరిగి సదరం ద్వారా వారికి పరీక్షలు నిర్వహించి అంగవైకల్య శాతం పెరిగితే తిరిగి వారికి పింఛన్ మంజూరు చేసే అవకాశాలు న్నాయి. జిల్లాలో మొత్తం 33,500 దివ్యాంగుల పింఛన్ లబ్ధిదారులున్నారు. వీరిలో ఇప్పటివరకు 28 వేల పింఛన్‌లను పరిశీలించగా 4,200 దివ్యాంగ పింఛన్‌లకు సంబంధించి లబ్ధిదారులను అనర్హులుగా గుర్తించారు. ఇక వివిధ రకాల దీర్ఘకాలిక రోగాలతో మంచాన పడిన వారు, దీర్ఘకాలిక వ్యాధులు కిడ్నీ, లివర్ సమస్యలు , పక్షవాతం సమస్యలు ఉన్నవారు, ఇంకా పలు రకాల దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారి పింఛన్‌లను కూడా పరిశీలన చేపట్టి గుర్తించారు. జిల్లాలో దీర్ఘకాలిక రోగాలతో బాధ పడుతూ రూ.15 వేలు పింఛన్ పొందుతున్న వారు మొత్తం 1,446 మంది ఉన్నారు. వీరిని డాక్టర్లు పరిశీలించి 182 మందిని పూర్తిగా అనర్హులుగా గుర్తించారు. 605 మందిని వృద్ధాప్య పింఛన్‌లకు, 589 మందిని దివ్యాంగ పింఛన్‌లకు మార్పు చేశారు. మిగిలిన వారికి నిబంధనల ప్రకారం అర్హులుగా గుర్తించి పింఛన్ ఇవ్వనున్నారు.

వైద్య పరీక్షల్లో అర్హత సాధిస్తే పునరుద్ధరణ

నూజివీడు : వివిధ కారణాలతో దివ్యాంగుల పెన్షన్ రద్దయిన వారు మెడికల్ బోర్డు నిర్వహించే వైద్య పరీక్షలో కనీసం 40 శాతం అంగవైకల్యం ఉందని సర్టిఫికెట్ పొందితే పెన్షన్ పునరుద్ధరిస్తారని నూజివీడులోని మంత్రి కొలుసు పార్థసారథి క్యాంప్ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఏలూరు జీజీహెచ్ ఆసుపత్రిలో, నూజివీడు డిస్ట్రిక్ట్ ఆసుపత్రిలో, జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మెడికల్ బోర్డు ఇచ్చే సర్టిఫికెట్‌ను అయా మండల ఎంపీడీవోకు సమర్పించాల్సి ఉంటుంది. మెడికల్ బోర్డు పరీక్షకు హాజరయ్యేటప్పుడు ఆధార్ కార్డు, పాత పెన్షన్ సర్టిఫికెట్, పాస్‌పోర్టు ఫొటో, మెడికల్ బోర్డు అప్లికేషన్ ఫారంతో పైన పేర్కొన్న ఆసుపత్రిలో జరిగే వైద్య పరీక్షలకు హాజరు కావాలి.

అంగన్‌వాడీ భవనాలకు మోక్షం

- ఉపాధి కింద 96 నిర్మాణాలు పూర్తికి కసరత్తు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనాలకు మోక్షం కలిగించే దిశగా అడుగులు పడుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తి చేయాలన్న చిత్తశుద్ధి లేకపోవడంతో కొత్త భవనాలు అమరలేదు. 2014-19 కాలంలో ఉపాధి హామీ పథకం కింద రూ.ఏడు లక్షల వ్యయంతో 96 భవన నిర్మాణాలు ప్రారంభించారు. ఉపాధి హామీ కూలీల వేతన కాంపోనెంట్, మెటీరియల్ కాంపొనెట్‌ల విభజనలో ఇబ్బందుల వల్ల చేపట్టాల్సిన పనులు ముందుకు సాగలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కనీసం ఈ భవనాల వైపు కన్నెత్తి చూడలేదు. అప్పట్లో నిధుల లేమి, బిల్లుల చెల్లింపులు జరగక అసంపూర్తిగా నిలిచిపోయాయి. తాజాగా వీటికి కదలిక రావడంపై హర్షం వ్యక్తమవుతోంది.

డీఆర్‌సీలో చర్చతో కదలిక

ఆగిపోయిన భవనాలపై సోమవారం జరిగిన డీఆర్‌సీ సమావేశంలో చర్చ సాగింది. పలువురు ఎమ్మెల్యేలు నిలిచిన భవనాలు పూర్తి చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో వీటిని ఉపాధి పథకం కింద పూర్తి చేయడానికి పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించాలని నిర్ణయించారు. ఉపాధి నిధులు రాక ఆలస్యమవుతున్న తరుణంలో కొత్తగా భవనాలను పూర్తి చేయాలన్న ప్రతిపాదనపై స్పందన ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. జిల్లా వ్యాప్తంగా 2,225 అంగన్ వాడీ కేంద్రాలకు గాను జిల్లాలో 842 కేంద్రాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంతో అసంపూర్తి భవనాలను పూర్తి చేస్తే భవనాలకు అద్దెల భారం తప్పనుంది.

అందని రాయితీ కందిపప్పు!

ఏలూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రేషన్‌షాపుల ద్వారా పేదలకు అందించే కందిపప్పు కోసం ఎదురుచూస్తున్న రేషన్ కార్డుదారులకు ఈనెల కూడా నిరాశే ఎదురైంది. జిల్లాలో 6,18,864 మంది తెల్లరేషన్ కార్డుదారులు, 34,188 మంది అంత్యోదయ కార్డుదారులు ఉన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక రేషన్ షాపుల ద్వారా బియ్యం, పంచదారతో పాటు మూడు నెలలు పాటు రాయితీ కందిపప్పు పంపిణీ చేశారు. ఆపై దీనిని కొనసాగిస్తారని కార్డుదారులు ఆశించినా కందిపప్పును నిలిపివేశారు. కేజీ కందిపప్పు ధర మార్కెట్‌లో రూ.150 వరకు ఉండగా ప్రభుత్వం రాయితీపై ఒక్కో కార్డుదారుడికి రూ.67 చొప్పున మాత్రమే విక్రయిస్తుండడంతో పేదలు ప్రభుత్వం అందించే రాయితీ కందిపప్పు కోసం ఎదురుచూస్తున్నారు. గత జూన్ నుంచే అన్ని రకాల రేషన్ సరుకులను రేషన్ షాపుల ద్వారా అందిస్తామని టీడీపీ ప్రభుత్వం ప్రకటించినా రాయితీ కందిపప్పు సరఫరా చెయ్యకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. ప్రస్తుతం పండుగల సీజన్ కావడంతో వచ్చేనెలలోనైనా ప్రభుత్వం పేదలకు రాయితీపై కందిపప్పు పంపిణీ చెయ్యాలని కోరుతున్నారు.

టీచర్ల అంతర్ జిల్లా బదిలీలకు గ్రీన్ సిగ్నల్

లోపలి పేజీలో..

మామిడి తోటలో.. రేషన్ బియ్యం దందా!

ఆగిరిపల్లి కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమ రవాణా?



నూజివీడు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):నూజివీడు నియోజకవర్గంలోని ఆగిరిపల్లి కేంద్రంగా పెద్ద ఎత్తున రేషన్ బియ్యం అక్రమంగా రవాణా జరుగుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అడపాదడపా అధికారులు అక్రమ రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్టు చూపుతున్నా బియ్యం అక్రమ రవాణాను అరికట్టలేకపోతున్నారు. నూజివీడు మండలం నుంచి ఒకరు, ఆగిరిపల్లి నుంచి మరొకరు సంయుక్తంగా ఈ బియ్యం అక్రమ రవాణాలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారని ప్రచారంలో ఉంది. నూజివీడు, తిరువూరు, గన్నవరం మండలాల్లోని కొన్ని గ్రామాలు, మైలవరం మండలంలోని కొన్ని గ్రామాలు నుంచి రేషన్ బియ్యాన్ని వీరు కొనుగోలు చేస్తున్నారు. ఆ బియ్యాన్ని ఆగిరిపల్లి-శోభనాపురం రోడ్డులోని ఓ మామిడి తోటకు చేర్చి అక్కడి నుంచి ప్రతీ నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీలోపు 30 నుంచి 40 లారీల రేషన్ బియ్యాన్ని రాత్రివేళ చెన్నై పోర్టుకు తరలిస్తున్నట్టు సమాచారం. గతంలో ఈ బియ్యం కాకినాడ పోర్టుకు వెళ్లేవి. అక్కడ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా వీరు చెన్నైకి తరలిస్తునట్టు సమాచారం. ఆగిరిపల్లి నుంచి నెల్లూరు వరకు ఒక బిల్లుపైన, నెల్లూరు నుంచి చెన్నైకి మరో బిల్లు పైన ఈ బియ్యం అక్రమ రవాణా సాగుతున్నట్టు ప్రచారంలో ఉంది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఈ బియ్యం అక్రమ రవాణాదారులుకు ఎదురేలేదు. అక్రమ రవాణాను అదుపు చేయాల్సిన వ్యవస్థలన్నీంటిని ఈ అక్రమ బియ్యం వ్యాపారులు మేనేజ్ చేస్తున్నారు. అతి సాధారణ రేషన్ డీలర్ స్థాయి నుంచి వచ్చిన ఈ అక్రమ బియ్యం వ్యాపారులు నేడు అధికారులను, స్థానిక ప్రజాప్రతినిధులను శాసించే స్థాయికి ఎదిగారన్న ఆరోపణలున్నాయి. వీరికి బడా అక్రమ బియ్యం రవాణా వ్యాపారులతో ఎన్నో ఏళ్లుగా ఉన్న లావాదేవీల వల్లే అధి కారులు మారిన ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మారిపో వీరి దందా యథేచ్ఛగా సాగుతోందని తెలుస్తోంది.



మూలవిరాట్‌పై పవిత్రారోపణ.. హారతి

నేత్రపర్వం.. పవిత్రోత్సవం

ద్వారకాతిరుమల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సుందర గిరిపై లక్ష్మీనారసింహుని దివ్య పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం నిత్యహోమం, బలిహరణ, మూల మంత్రహోమాలు, అభిషేకాలు, పవిత్రారోపణ. జరుగాయి. శ్రీకనక వల్లీ సమేత శ్రీలక్ష్మీ నారసింహుని ఉత్సవమూర్తులను శేషవాహనంపై ఉంచి ఆలయంలో తిరుగాడగా ముందు పవిత్రాలతో అర్చకులు, పండితులు ఆలయంలో ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆలయ మూలవిరాట్, ఉత్సవమూర్తులపై ఈ పవిత్రాలను ఉంచి ఆరోపణ చేసారు.

లక్ష్మీపురం ఆలయంలో..

లక్ష్మీపురంలోని పురాతన ఆలయంలో బుధవారం పవిత్రారోహణ శాస్త్రోక్తంగా జరిగింది. తొలుత ఆలయ యాగశాలలో ఉంచిన పవిత్రాలను శిరస్సులపై ఉంచుకుని అర్చకులు, పండితులు, వేదమంత్రోచ్ఛరణల నడుమ ఆలయంలో ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం ఆ దివ్యపవిత్రాలను శ్రీవారి మూలవిరాట్, అమ్మవార్లు, ఉత్సవమూర్తులపైనా ఉంచారు. ఆలయంలో కొలువైన సుభద్ర, బలభద్ర. జగన్నాథుల మూలవిరాట్, ఆళ్వార్‌పై ఈ పవిత్రాలను వేశారు.



24/7 ఆపదలో అభయం

టోల్‌ఫ్రీ నంబర్

భీమవరం క్రైం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): దైనందిన జీవితంలో పలు సందర్భాల్లో ఆపదలో చిక్కుకుంటాం. చుట్టుపక్కల ఎవరూ ఉండరు.. సమస్యను ఎలా పరిష్కరించుకోవాలో తెలియదు.. అలాంటి సమయాల్లో టోల్‌ఫ్రీ నంబర్లు 24 గంటలు రక్షణగా నిలుస్తుంటాయి. ఆయా నంబర్లకు కాల్ చేసి సమస్యను తెలిపితే భరోసా లభిస్తుంది. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి బాధితులకు అండగా నిలుస్తారు. ఏ సమస్యకు ఏ నంబర్‌లో సంప్రదించాలనేది తెలుసుకుందాం.


- **112** ఈ నంబర్‌కు కాల్ చేస్తే పోలీసులు అందుబాటులోకి వచ్చి సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇస్తారు. తక్షణమే అక్కడి సిబ్బంది స్పందించి సమస్యను బట్టి పరిష్కార మార్గం చూపుతారు.
- **108** ఆరోగ్య అత్యవసర పరిస్థితి, రోడ్డు ప్రమాదాలు, పాముకాటు సందర్భాలలో ఈ నంబర్ ఎంతగానో ఉపకరిస్తుంది. 108 నంబర్‌కు కాల్ చేయగానే సిబ్బంది స్పందించి వెంటనే ఏ ప్రాంతంలో ప్రమాదం చోటుచేసుకుందో ఆ ప్రాంతానికి కనెక్షన్ కలిపి వెంటనే సిబ్బంది అక్కడికి చేరుకునేలా చేస్తారు.
- **1098** బాలలపై లైంగిక వేధింపులు, బాల కార్మికుల గుర్తింపు, అక్రమ రవాణా, చిన్నారులు మాదకద్రవ్యాలకు అలవాటు పడినా ఈ నంబర్‌కు సమాచారాన్ని ఇవ్వవచ్చు. అధికారులు స్పందించి ఆ పిల్లలను సంరక్షణ కేంద్రాలకు తరలిస్తారు.
- **1930** సైబర్ నేరగాళ్ల బారినపడి నష్టపోతే వెంటనే ఈ నంబర్‌కు ఫోన్ చేయాలి. బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయం, డిజిటల్ అరెస్ట్ బెదిరింపులపై తక్షణమే ఈ టోల్‌ఫ్రీ నంబర్‌కు సంప్రదించాలి.
- **1073** ట్రాఫిక్ పోలీసులు తమ సేవలను నిరంతరాయంగా అందించేందుకు ఈ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చారు. రోడ్లపై ట్రాఫిక్ జామ్, ప్రమాదాలు, ఇతర అవసరాల్లో సేవలను వినియోగించుకోవచ్చు.
- **181** గృహ హింస, మహిళలు, విద్యార్థినులను బంధించినా ఈ నంబర్‌కు సమాచారం ఇస్తే తక్షణమే వన్ స్టాప్ కేంద్రం సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుంటారు. న్యాయపరంగా ఇతర విషయాల్లోను బాధితులకు అండగా నిలుస్తారు.
- **101** అగ్నిమాపక శాఖాధికారుల సేవలు వినియోగించుకునేందుకు ఈ నంబర్‌కు ఫోన్ చేయవచ్చు. గ్యాస్ లీకేజీ, బోరు బావి ప్రమాదాలు, నీళ్ళల్లో మునిగిపోతున్నా, ఇళ్లు, షాపింగ్ మాల్స్ ఇతర ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించినా సమాచారం అందించి రక్షణ పొందవచ్చు.
- **1912** విద్యుత్ శాఖ అందిస్తున్న సేవల్లో అంతరాయం ఏర్పడినా, లో వోల్టేజీ సమస్యలు ఎదురైనా, వీధిదీపాలు వెలగకపోయినా, బిల్లింగ్ సమస్యలపై ఈ నంబర్‌కు సమాచారం ఇచ్చి పరిష్కరించుకోవచ్చు.
- **1090** దొంగతనాలు, అపరిచితుల సంచారంపై ఈ నంబర్‌కు తెలియజేయవచ్చు. అధికారులు వెంటనే స్పందించి పరిష్కారాన్ని చూపిస్తారు.
- **104** వైద్యం, ఆరోగ్యం పొందాలంటే ఈ నంబర్‌కు సమాచారం ఇవ్వాలి. ఏదైనా అనారోగ్య సమస్యలు ఉంటే ఈ నంబర్‌కు ఫోన్ చేయగానే వైద్యులు వచ్చి వైద్యం అందిస్తారు. కొవిడ్-19 హెల్ప్‌లైన్ నంబర్‌గా కూడా ఉపయోగించుకోవచ్చు.
- **14500** మద్యం అక్రమంగా తయారు చేస్తున్నా.. విక్రయిస్తున్నా ఈ నంబర్‌కు సమాచారం ఇస్తే అధికారులు వెంటనే చర్యలు తీసుకుంటారు. ఇసుక స్మగ్లింగ్, అక్రమంగా నిల్వలపై ఈ నంబర్‌కు ఫోన్ చేయగానే అధికారులు చర్యలు తీసుకుంటారు.

జల కళ

పూర్తిగా నిండిన తమ్మిలేరు జలాశయం



నిండు కుండలా పోగొండ జలాశయం





జలకళతో ఎర్రకాల్వ జలాశయం



ఎర్రకాల్వ జలాశయం నీటి మట్టం

భారీ వర్షాలతో మెట్ట ప్రాంతంలో జలాశయాలు జల కళ సంతరించుకున్నాయి. తమ్మిలేరు, పోగొండ, ఎర్రకాల్వ జలాశయాలు సామర్థ్యం మేరకు పూర్తిస్థాయి నీటిమట్టం నమోదైంది. సాగు నీటి అవసరాలకు ఉపయోగమని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బుట్టాయగూడెం జల్లేరు జలాశయంలో పూర్తిస్థాయి నీటి మట్టం నమోదు కాకపోవడం నిరాశ కలిగించింది.

నిండిన జలాశయాలు

నిండిన తమ్మిలేరు

చింతలపూడి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): చింతలపూడి సమీపంలోని తమ్మిలేరు రిజర్వాయరు జలకళతో అలరారుతోంది. ఏలూరుకు తమ్మిలేరు ముంపు నివారణ కోసం నాగిరెడ్డిగూడెం వద్ద బహుళార్థక ప్రయోజనంగా రిజర్వాయర్ నిర్మించారు. వరద నివారణ, సాగునీటి వనరుగా ఉంది. రిజర్వాయర్ రెండు బేసిన్‌లు కలిసి మూడు కాలువల ద్వారా పంటలు సాగవుతాయి. ఎగువ భాగం తెలంగాణలోని బేతుపల్లి చెరువు అలుగు నీరు తమ్మిలేరు వాగుగా ప్రవహిస్తుంది. దిగువన కుడి, ఎడమ, మధ్య కాలువల నుంచి తొమ్మిది వేల ఎకరాల్లో వరి సాగవుతుంది. ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు కృష్ణా జిల్లా వైపు 4,500 ఎకరాలు, పశ్చిమలో 4,500 ఎకరాలకు సాగునీరు అందించారు. జిల్లాలు మారడంతో ప్రస్తుతం కుడి, ఎడమ, మధ్య కాలువలు ఏలూరు జిల్లాలో కలిసి ఉన్నాయి. ఈ ఏడాది బుధవారం నాటికి నీటి మట్టం 340 అడుగులు ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 340 అడుగులు నమోదైంది. 344 అడుగుల వద్ద ఇరిగేషన్ లెవెల్ నిల్వ చేస్తారు. 348 అడుగులు నీటి మట్టం చేరితే వరద గేట్ల ద్వారా అదనపు నీరు దిగువకు విడుదల చేస్తారు. ఇప్పటికే నూరు శాతం ఊడ్పులు పూర్తయ్యి రైతులు సంతోషంగా ఉన్నారు. ఈ ప్రాజెక్టు కోసం 16 కోట్ల జపాన్ బ్యాంకు నిధులతో చేపడుతున్న మరమ్మతు పనులు నత్తనడకలా సాగుతున్నాయని రైతులు చెబుతున్నారు.

పొర్లుతున్న పోగొండ

బుట్టాయగూడెం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పోగొండ జలాశయం నిండుకుండను తలపిస్తుంది. జలాశయం నీటి మట్టం సామర్థ్యం 157 మీటర్లు కాగా ప్రస్తుతం అంతే నీటి మట్టం ఉండడంతో సర్‌ప్లస్ ఛానల్ ద్వారా దిగువకు నీరు పొర్లుతోంది. పోగొండ జలాశయం కొద్దిపాటి వర్షానికి వచ్చే వరద నీటితో నిండిపోతుంది. వర్షపాతం గత ఏడాదితో పోలిస్తే 65 శాతం మైనస్‌లో ఉంది. ఆగస్టు నెలాఖరుకు 297 మి.మీ. వర్షపాతం నమోదు కావలసి ఉండగా ఇప్పటివరకు 102.6 మి.మీ. మాత్రమే పడింది. గత ఏడాది ఇదే సమయంలో 193.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

ఎర్రకాలువ జలాశయంలో వరద నీరు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో వర్షాలతో జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెంలోని ఎర్రకాలువ జలాశయంలో వరదనీరు భారీగా చేరింది. జలాశయం కెపాసిటీ 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 81.42 మీటర్లు ఉంది. 81.50 మీటర్ల వరకు వరద నీరు ప్రాజెక్టులోకి చేరితే దిగువకు నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. 2018 ఆగస్టులో భారీ వరదల కారణంగా ఎర్రకాలువ జలాశయంలోకి ఒక్క గంటలోనే 83.50 మీటర్లుకు పైగా వరద నీరు చేరడంతో జలాశయం గేట్ల పై నుంచి వరద నీరు దిగువకు ప్రవహించింది. దిగువ ప్రాంతాలలో ఉన్న ఇళ్లు, పంట పొలాలు నీట మునిగి తీవ్ర నష్టాన్ని తీసుకువచ్చింది. గత ఏడాది ఇదే రోజుకు జలాశయంలో 81.89 మీటర్లు వరద నీరు చేరిందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ అధికారులు సూచించారు.

జల్లేరులో వెలితి



గుబ్బల మంగమ్మ జల్లేరు జలాశయం పూర్తిగా నిండ లేదు. గత ఏడాది ఇదే సమయంలో వర్షాలు పుష్కలంగా కురవడంతో పూర్తి జలకళతో ఉంది. ఈ ఏడాది పూర్తిస్థాయి నీరు చేరలేదు. జలాశయం పూర్తి సామర్థ్యం 217.80 మీటర్లు కాగా ప్రస్తుతం 212.40 మీటర్లు ఉంది. గత ఏడాది ఇదే సమయంలో నీటిమట్టం 215.75 మీటర్లుగా ఉంది. గతంతో పోలిస్తే 3.35 మీటర్ల నీటి సామర్థ్యం తక్కువ ఉంది. జలాశయం ద్వారా 4500 ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఆయకట్టు రైతులంతా వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. వరుణుడు కరుణించాలని కోరుతున్నారు.

నూజివీడు, దెందులూరుకు సాగర్ జలాలు



పాడేరు వద్ద సాగర్ ఎడమ కాలువకు గండిపడిన చోట మరమతు పనులు

నూజివీడు, ఆగస్టు 20, (ఆంధ్రజ్యోతి): సాగర్ ఎడమ కాలువ కింద 2.25 లక్షల ఆయకట్టు ఉంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని కొన్ని మండలాలలో పాటు ఏలూరు జిల్లా నూజివీడు, దెందులూరు నియోజకవర్గాల పరిధిలో సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు ఉంది. ఈనాడు తెలంగాణ నుంచి హక్కుగా రావాల్సిన నీరు ఏనాడు ఈ ఆయకట్టుకు అందలేదు. ఏటా జరిగే తంతులో భాగంగానే ఏడాది సాగర్ నీరు తెలంగాణ నుంచి వదిలారు. తెలంగాణ ప్రాంతంలోని పాడేరు వద్ద గతంలో సాగర కాలువకు గండిపడిన చోట గట్టు పటిష్టంగా లేదని, పూర్తి సామర్థ్యం మేర నీరు కాలువలో వదలలేకపోతున్నామని తెలంగాణ ఇరిగేషన్ శాఖ అధికారులు రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథికి రెండు రోజుల క్రితం తెలిపారు. ప్రసుతం ఈ కాలువలో 700 క్యూసెక్కుల నీరు మాత్ర మే వదిలారు. నిబంధనల ప్రకారం 1500 క్యూసెక్కుల నీరు వదలవలసి ఉంది. కాలువ గట్టు బలహీనం పేరు తో కేవలం 700 క్యూసెక్కుల నీరు మాత్రమే వదలడంతో సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు ప్రాంతంలోని ఉమ్మడి కృష్ణ, ఏలూరు జిల్లాల ప్రాంత మెట్ట రైతులకు నీరందని పరిస్థితి ఉంది. పరిస్థితి గమనించి మంత్రి పార్థసారథి నూజివీడు నియోజకవర్గం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ బాలకృష్ణతో పాటు సాగర్ అధికారులను తెలంగాణలో బలహీనంగా ఉన్న గట్టు వద్దకు పంపి తన సొంత నిధు లు రూ.1.3 లక్షు వెచ్చించి గండి మరమ్మతులు చేపట్టారు. బలహీనంగా ఉన్న గట్టును పటిష్టంగా చేశామని స్వయంగా చూసి పూర్తి సామర్థ్యం మేరకు నీరు విడుదల చేయాలని సాగర్ అధికారులను మంత్రి కోరారు. దీంతో ఈకాలువకు 1500 క్యూసెక్కుల నీరును సాగర్ తెలంగాణ అధికారులు విడుదల చేశారు. రెండు మూడు రోజుల్లో చాత్రాయి, నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి మండలాలకు సాగర్ నీరందుతుంది.





రతన్ టాటా ఇన్నోవేటివ్ హబ్ ప్రారంభ సభలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న మంత్రి నిమ్మల, కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే గోరంట్ల, హాజరైన పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు

ఉద్యోగ, ఉపాధి కేంద్రంగా ఏపీ

ఆవిష్కాంధ్ర సాధనతో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఓ మైలురాయి

ప్రారంభ సభలో మంత్రి నిమ్మల

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధికి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తీర్చిదిద్దుతున్నారని తూర్పు గోదావరి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం శ్రీ వేంకటేశ్వరా ఆనం కళా కేంద్రంలో ఆవిష్కాంధ్ర సాధన సభ జరిగింది. తొలుత మంగళగిరి మయూరి టెక్ పార్క్ ప్రాంగణం నుంచి సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని డిజిటల్ స్ర్కీన్‌పై తిలకించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి నిమ్మల మాట్లాడారు. 'ఆవిష్కాంధ్ర సాధనతో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఓ మైలురాయి. విజన్ 2020 అంటే ఆనాడు సాధ్యమా అని అనుకున్నారు. కాని ప్రతి ఇంటికి ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను తయారు చేయడంలో చంద్రబాబు లక్ష్యసాధకులయ్యారు. ఇప్పుడు అమరావతి కేంద్రంగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారు. ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే వ్యవసాయ, పరిశ్రమలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, లా అండ్ ఆర్డర్ బాగుండాలి. వాటిని సరిచేసి రాష్ట్రాన్ని ఇన్నోవేషన్ హబ్‌గా మార్చాలన్నదే చంద్రబాబు సంకల్పం. అందులో భాగంగా ఆవిష్కాంధ్ర దిశగా తొలి అడుగు పడడం ఎంతో సంతోషదాయకం. యువతలో దాగి వున్న సృజనాత్మకతను వెలికితీసి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఉపయోగపడుతుంది' అని అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ చంద్రబాబు విజన్‌లో భాగంగా ప్రవేశపెట్టిన ఈ ఇన్నోవేషన్ హబ్ రాష్ట్రాన్ని పారిశ్రామికంగా మరింత ముందుకు తీసుకువెళుతుందని చెప్పారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తును గొప్పగా మలిచేందుకు ఈ ఇన్నోవేషన్ హబ్ ద్వారా సీఎం నాంది పలికారన్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరావు మాట్లాడుతూ చంద్రబాబు కృషి ఫలితంగానే ఈ రోజు దేశ విదేశాలలో మన వాళ్లు మంచి స్థాయిలో ఉద్యోగాల్లో ఉన్నారన్నారు. నన్నయ్య వర్సిటీ వీసీ వి.ప్రసన్న, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు, ఆదిత్య యూనివర్సిటీ చైర్మన్ శేషారెడ్డి, గెయిల్ ప్రతినిధి కేవీఆర్.రావు, ఓఎన్‌జీసీ ప్రతినిధి కేవీకే రాజు, గ్రీన్‌కోర్ చైర్మన్ ఐ.రాంబాబు మాట్లాడారు. అందరితో తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి ప్రతిజ్ఞ చేయించారు. కళా కేంద్రం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను వారు తిలకించారు. జేసీ ఎస్.చిన్నరాముడు, డీఆర్వో టి.సీతారామమ్మూర్తి, ఆర్డీవో ఆర్ కృష్ణనాయక్, తాడేపల్లిగూడెం ఎన్ఐటీ ప్రతినిధి రవికిరణ్‌శాస్త్రి, వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ ప్రతినిధి డీన్ డాక్టర్ ఎస్.సూర్యకుమారి, పారిశ్రామికవేత్తలు, వివిధ కళాశాలల ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. అంతకుముందు బొమ్మూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో నిర్మించిన రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి నిమ్మలతోపాటు రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కందుల దుర్గేష్ హాజరయ్యారు.

డేంజర్

- రోడ్డుపై విద్యార్థుల నిరీక్షణ
- ఆగని బస్సులతో తప్పని తిప్పలు
- పెనుగొండ కళాశాల వద్ద పాట్లు
- వాహనాల రద్దీతో ప్రమాదం



పెనుగొండ కళాశాల వద్ద రోడ్డుపై వేచివున్న విద్యార్థినులు, వాహనాల రాకపోకలు

పెనుగొండ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఎస్‌వీకేపీ డాక్టర్ కేఎస్.రాజు ఆర్ట్స్ అండ్ కళాశాల కూడలిలో విద్యార్థులు బస్సుకోసం ప్రమాదకర పరిస్థితిలో రోడ్డు పక్కన నిరీక్షిస్తున్నారు. వాహనాల రద్దీతో పాటు ఎండ, వాన, దుమ్ముతో ఇబ్బందులు పడాల్సిందే. కళాశాలతో పాటు ఎదురుగా వాసవీ ధామ్, పక్కనే నగరేశ్వర మహిషాసురమర్ధని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంతో నిత్యం యాత్రికుల రద్దీ ఉంటుంది. ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులు సుమారు 3 వేల ఉంటారు. సుమారు 1500 మంది దూర ప్రాంతాల నుంచి వస్తారు. ఉదయం, సాయంత్రం రోడ్డు కిక్కిరిసిపోతుంది. వాహనాల రద్దీతో ప్రమాదం ముంచుకొస్తుందని అటువైపు వెళ్లేవారు సైతం ఆందోళన చెందుతున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల మధ్య, సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య భక్తులు, విద్యార్థులతో రద్దీగా ఉంటుంది. రద్దీ చూసి కొన్ని బస్సులు సైతం ఆపరు. రోడ్డు విస్తరణతో బస్ షెల్టర్ తొలగించారు. తర్వాత నిర్మాణం చేపట్టలేదు. విద్యార్థులు, యాత్రికులకు రోడ్డుపై పడిగాపులు తప్పడం లేదు.

రోడ్డుపై పడిగాపులు



బస్సు కోసం రోడ్డుపై పడిగాపులు కాయాలి. సమయానికి బస్సు రాదు.. ఎండ, వానలో వేచి ఉండాల్సిందే. సిద్ధాంతం నుంచి ప్రతీ రోజూ కళాశాలకు వస్తుంటాను. నేను డిగ్రీ చదువుతున్నాను. ఇక్కడ వేచి ఉండేందుకు బస్సుషెల్టర్ నిర్మించాలి.

- జి.సాహితి, సిద్ధాంతం

నిలబడాల్సిందే..



ప్రతీ రోజూ రావులపాలెం నుంచి వస్తాను. కళాశాల అయ్యాక ఇంటికి వెళ్లాలంటే నరకయాతన. రోడ్డుపై నిలబడాల్సిందే. బస్సు వచ్చినా రద్దీ చూసి ఆపరు. ఒక వేళ బస్సు ఆపినా జనంతో కిక్కిరిసిపోయి బస్సుకూడా ఎక్కలేని పరిస్థితి.

- జి.స్వాతి, రావులపాలెం

వాహనాల రద్దీతో భయం



రోజూ తణుకు నుంచి వస్తాను. కళాశాల అయ్యాక ఇంటికి వెళ్లేందుకు బస్సు కోసం వేచి చూస్తాం. కానీ ఈ ప్రాంతం నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. వాహనాల రాకపోకలతో రోడ్డు పక్కన వేచిఉండడం ప్రమాదే. షెల్టర్ నిర్మించాలి.

- ఎం.మార్తమ్మ, తణుకు



శిక్షణ అనంతరం పరీక్ష రాస్తున్న సొసైటీ సిబ్బంది

కేవికేలో సొసైటీ సిబ్బందికి ముగిసిన శిక్షణ

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన యూనివర్సిటీ ఆవరణలోని కృషివిజ్ఞాన కేంద్రంలో సొసైటీ సిబ్బందికి సమగ్ర పోషక యాజమాన్యంపై శిక్షణ ఇచ్చారు. సహకార పరపతి సంఘం సిబ్బందికి 15 రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. శిక్షణ పొందిన వారి పరిజ్ఞానం తెలుసుకునేందుకు పరీక్ష కూడా నిర్వహించారు. కేవికే ప్రధాన శాస్త్రవేత్త విజయలక్ష్మి ఆధ్వర్యంలో శిక్షణ సాగింది. విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు బి.గోవిందరాజులు శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్‌లు అందించారు. కోర్సు ఫెసిలిటేటర్ బి.పెద్దబాబు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ రాజు

30న పెనుగొండలో సాహితీ సదస్సు

బ్రోచర్ ఆవిష్కరించిన ఎస్‌వీకేపీ కళాశాల కరస్పాండెంట్

పెనుగొండ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత మునిపల్లి రాజు శతజయంతి సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమి సౌజన్యంతో ఎస్‌వీకేపీ అండ్ డాక్టర్ కెఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈ నెల 30న జాతీయ స్థాయి సాహితీ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్ర రాజు తెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమితో కలిసి కళాశాల ప్రాంగణంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జాతీయ సదస్సుఅని తెలిపారు. జాతీయ సదస్సు వివరాలతో కూడిన కరపత్రాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్‌వైవీవీ అప్పారావు, సదస్సు డైరెక్టర్ రంకిరెడ్డి రామ్మోహనరావు, సదస్సు కన్వీనర్ డాక్టర్ కెవీఎన్‌డీ.వర ప్రసాద్, కళాశాల తెలుగు శాఖ అధ్యాపకులు షేక్ ఆదంషా, కె.సురేష్ బాబు, కేవీ.సుబ్బారావు బుధవారం ఆవిష్కరించారు. ఈ సదస్సులో పలువురు ప్రముఖులు, పరిశోధకులు పాల్గొని తమ పరిశోధనా పత్రాలను సమర్పిస్తారన్నారు. ప్రముఖ కథ, నవల, కవిత్వ, వ్యాస రచయిత అయిన మునిపల్లె రాజుసాహిత్యంపై జరుగుతున్న ఈ జాతీయ సదస్సుకు తెలుగు సాహిత్యంపై ఆసక్తి కలిగిన వారందరిని ఈ సందర్భంగా ఆహ్వానిస్తున్నట్లు వారు తెలిపారు.

బాల చందర్‌కు తెలుగుతేజం అవార్డు



పెనుగొండ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా సేవలో అతి పెద్ద సాహితి సంస్థ శ్రీశ్రీ కళావేదిక నుంచి కవి, రచయిత గాయకుడు డాక్టర్ బాల చందర్ సాదే తెలుగు తేజం అవార్డు అందుకోనున్నారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారధ్యంలో పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఈ నెల 31న శతాధిక జాతీయ కవి సమ్మేళనంలో అవార్డు అందుకోనున్నట్లు బాల చందర్ బుధవారం తెలిపారు. సంస్థ జాతీయ అధ్యక్షుడు జి.ఈశ్వరిభూషణం నుంచి తనకు ఆహ్వానం అందినట్లు తెలిపారు. తెలుగు భాష, సంస్కృతి, కళలకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా తెలుగుతేజం అవార్డుకు తనను శ్రీశ్రీ కళావేదిక సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షుడు జి. ఈశ్వరిభూషణం ప్రధాన కార్యదర్శి టి.పార్థసారధి తనను అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. బాలచందర్‌కు తెలుగు తేజం అవార్డు రావడంపై పలువురు అభినందించారు.

కల్లుగీత వర్గాలకు బార్లు

- పశ్చిమలో 3, ఏలూరు జిల్లాలో 2 కేటాయింపు
- 29 వరకు దరఖాస్తులు.. 30న లాటరీ ద్వారా లైసెన్స్

ఏలూరు/భీమవరం క్రైం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం కేటాయించిన ఐదు బార్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ ఎక్సైజ్ అధికారులు బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఏలూరు నగరంలో శెట్టిబలిజ, జంగారెడ్డిగూడెంలో గౌడ వర్గాలకు బార్లు కేటాయించినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య తెలిపారు. పశ్చిమలో భీమవరం, తాడేపల్లిగూడెంలో శెట్టిబలిజ, పాలకొల్లులో గౌడ కులాలకు కేటాయించినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి కేవీ నాగప్రభుకుమార్ తెలిపారు. దరఖాస్తుదారులకు డ్రా తీసి లైసెన్స్ కేటాయిస్తారు. ఈ నెల 29 సాయంత్రం 5 గంటల వరకు అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చు. 30న డ్రా తీసి లైసెన్స్‌లు కేటాయిస్తారు. ఏలూరులో బార్‌కు రూ.27.50 లక్షలు, జంగారెడ్డిగూడెంలో రూ.17.50 లక్షలు, భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లుల లో బార్‌లకు రూ.27.50 లక్షలు లైసెన్స్ ధర నిర్దేశించారు. సెంట్రలైజ్డ్ బ్యాంకులు లేదా గ్రామీణ బ్యాంకుల్లో ఎక్సైజ్‌శాఖ అధికారులు పేరిట రూ.5 లక్షల దరఖాస్తు ఫీజు(నాన్ రిఫండబుల్ కింద) డీడీ కట్టి, ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్ హైబ్రీడ్ విధానంలో దరఖాస్తులను సమర్పించాలన్నారు. సంబంధిత జిల్లా వారు మాత్రమే లైసెన్సులు పొందడానికి అర్హులని, విధిగా వారి కులం సబ్ కాస్ట్ సర్టిఫికెట్‌ను సమర్పించాలన్నారు.

ఐటీఐల్లో మూడో విడత ప్రవేశాలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):ఏలూరు జిల్లాలోని 5 ప్రభుత్వ, 14 ప్రైవేటు ఐటీఐల్లో మిగిలివున్న సీట్ల భర్తీకి మూడో విడత కౌన్సెలింగ్‌కు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కౌన్సెలింగ్ కన్వీనర్ డి.భూషణం బుధవారం తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 26 సాయంత్రం 5 గంటల్లోగా సమర్పించాలని సూచించారు. దరఖాస్తు కాపీ, ఒరిజినల్ ధ్రువ పత్రాలను విద్యార్థి ఎంచుకున్న సంబంధిత ఐటీఐలో 27 సాయంత్రం 5 గంటల్లోగా పరిశీలనకు తీసుకువెళ్లాలన్నారు. ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుదారులకు ఈ నెల 29న, ప్రైవేటు ఐటీఐ ప్రవేశాలకు 30న కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కార్యాలయ ఫోన్ నంబరు 08812-230269లో సంప్రదించాలని కోరారు.

● ఉండి : పశ్చిమ గోదావరి జిల్లాలో ఉండి, ఆచంట ప్రభుత్వ ఐటీఐలలో సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఉండి కళాశాల ప్రిన్సిపాల్ వేగేశ్న శ్రీనివాసరాజు తెలిపారు. రెండేళ్ల కోర్సు పూర్తి చేసి బ్రిడ్జి కోర్సు ద్వారా పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చునని తెలిపారు.

ఏపీ నిట్‌లో బీటెక్ విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన



తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌లో బీటెక్ విద్యార్థుల ధ్రువ పత్రాల పరిశీలన బుధవారం నుంచి ప్రారంభమైంది. నిట్ విద్యాసంస్థలో మొత్తం 8 కోర్సులు నిర్వహిస్తుండంగా ఆయా కోర్సులలో మొత్తం 484 సీట్లు ఉన్నాయి. వీటిలో 50 శాతం సీట్లను రాష్ట్రానికి చెందిన విద్యార్థులకు కేటా యిస్తారు. మిగిలిన సీట్లను జోసా, సీసాబ్ కౌన్సెలింగ్ ద్వారా ఇతర విద్యార్థులతో భర్తీ చేయనున్నారు. ఇటీవల నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 2025-26 సంవత్సరానికి సంబంధించి అన్ని సీట్‌లకు కేటాయింపులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పరిశీలన కేంద్రంలో విద్యార్థులు తమ ఒరిజనల్ ధ్రువ పత్రాలను పరిశీలన చేయించుకోవడంతోపాటు ఫీజులు చెల్లించి కోర్సులలో చేరుతున్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 23వ తేదీ వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని నిట్ అధికారులు తెలిపారు. అడ్మిషన్ల విషయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నట్లు డీన్ అకడమిక్ డాక్టర్ ఎస్.జయరాం తెలిపారు. తొలి రోజు 86 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందినట్లు తెలిపారు.

3న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటన

ఏలూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వచ్చే నెల 3న ఏలూరు జిల్లాలో పర్యటిస్తారని, పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్ పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన అధ్యక్షతన పార్టీ సమావేశం జరిగింది. కిశోర్ మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా పర్యటన అనంతరం మాధవ్ 3న ఏలూరులో జిల్లా పర్యటిస్తారని, పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొంటారని వివరించారు. త్రిసభ్య కమిటీ సభ్యులు నాగోతు రమేష్‌నాయుడు, గుడిసే దేవానంద్, వల్లూరి జయప్రకాష్ పర్యటన వివరాలను పార్టీ శ్రేణులతో చర్చించారు.

24 నుంచి తిరుపతిలో 'అమరావతి చాంపియన్ షిప్'

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):తిరుపతిలో "అమరావతి చాంపియన్ షిప్-2025" పేరుతో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. 29న జరగనున్న నేషనల్ స్పోర్ట్స్ డేలో భాగంగా రాష్ట్రస్థాయి పోటీలకు తిరుపతి ఆతిథ్యమిస్తుందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 24, 25, 26వ తేదీల్లో రాష్ట్రస్థాయిలో హాకీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్ బాల్, ఖోఖో, కబడ్డీ, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్, ఆర్చరీ పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. రెండు వేల మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. 29న విశాఖపట్నంలో జరిగే నేషనల్ స్పోర్ట్స్ డేకు సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు.



వాండ్రంలో మాట్లాడుతున్న దళిత నాయకులు, మహిళలు

దళితవాడలో ఇళ్లు తొలగించొద్దు

అధికారులు, ప్రజా ప్రతినిధులకు దళితుల మొర

ఉండి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఇసుక కోడును ఆనుకుని ఉన్న దళితవాడలో 30 ఇళ్లను తొలగిస్తామని అధికారులు సర్వేచేసి మార్కు వేయడంపై దళితులు, ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇళ్లు తొలగించొద్దని అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు. మాజీ సర్పంచ్ యాడంగి సుజాత ఏసు, క్రిస్టియన్ సెల్ నాయకుడు మత్తే రాజ్‌కుమార్, రవికుమార్, విప్పర్తి రాణి, జోషి ఆలీషా, అన్నామణి తదితరులు బుధవారం ఇళ్ల సమస్యలపై మాట్లాడారు. తమ ముత్తాతల నుంచి ఇక్కడే నివసిస్తున్నామని, కొందరు భూస్వాములు తమ నివాసాలను కూల్చేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. దళితవాడను ఆనుకుని ఉన్న ఇసుక కోడు తవ్వి, తమ ఇళ్లను తొలగించి రోడ్ వేయాలని సర్వేలు చేయడం న్యాయం కాదని వాపోయారు. తమ ఇళ్ల ముందు రోడ్డు ఉందన్నారు. గ్రామంలో ప్రతీ వీధి, ప్రధాన వీధులకు సీసీ రోడ్లు ఉండగా డ్రెయిన్ పక్కనే రోడ్డు నిర్మాణం చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇళ్ల తొలగింపు ప్రయత్నాలను విరమించుకోవాలని దళితులంతా ముక్తకంఠంతో కోరారు. సమస్యను కలెక్టరు నాగరాణి దృష్టికి తీసుకుని వెళ్లినట్లు తెలిపారు. తమకు న్యాయం చేయాలని వారు నాయకులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నారు. దళితులు, సంఘస్తులు, మహిళలు పాల్గొన్నారు.



టీచర్ల అంతర్ జిల్లా బదిలీలకు గ్రీన్ సిగ్నల్

- నేటి నుంచే దరఖాస్తుల స్వీకరణ
- 30న ప్రభుత్వానికి తుది జాబితా

వేర్వేరు జిల్లాల్లో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ దంపతులకు, సొంత జిల్లాకు వెళ్లాలనుకునే సింగిల్ టీచర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. వివిధ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగ దంపతులు ఇక మీదట ఒకే జిల్లాలో పనిచేసేలా ఒక చోటకు చేర్చేందుకు ఉద్దేశించిన అంతర్ జిల్లాల స్పౌజ్, మ్యూచువల్ బదిలీలకు పాఠశాల విద్యాశాఖ బుధవారం మార్గదర్శకాలను, షెడ్యూలును ప్రకటించింది.

ఏలూరు అర్బన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):చిరకాలంగా వేరే జిల్లాల్లో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ దంపతులకు ఇది ఊరట కలిగించే విషయం. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి తమ జీవిత భాగస్వామి వద్దకు బదిలీపై వెళ్లేందుకు లేదా ఇతర జిల్లాల నుంచి ఇక్కడకు వచ్చేందుకు మార్గం సుగమమైంది. వేర్వేరు జిల్లాల్లో ఒకే కేటగిరీ, సబ్జెక్టు, మేనేజ్‌మెంట్‌లో పనిచేస్తున్న ఇరువురు సింగిల్ ఉపాధ్యాయుల పరస్పర బదిలీకి అవకాశం కల్పించారు. ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఎలాంటి పైరవీలు, ప్రజా ప్రతినిధుల సిఫారసులు లేకుండానే పారదర్శకంగా ఉద్యోగ దంపతుల బదిలీలు జరపడానికి షెడ్యూలును ప్రకటించడం విశేషం. స్పౌజ్, మ్యూచువల్ బదిలీలపై బుధవారం సాయంత్రం ఉత్తర్వులు, షెడ్యూలు ప్రకటన వెలువడిన గంటల వ్యవధిలోనే ఉద్యోగ, ఉపాధ్యాయుల మధ్య విస్తృత చర్చకు దారితీయగా, చిరకాలంగా బదిలీల కోసం ప్రభుత్వానికి అభ్యర్థనలు పంపి ఏళ్ల తరబడి ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్న వారంతా ఆయా జిల్లాల నుంచి అంతర్ జిల్లాల బదిలీ కోసం నిరీక్షిస్తున్న ఉపాధ్యాయుల వివరాల కోసం వాకబు చేయడం ప్రారంభమైంది. 2021లో టీచర్ల అంతర్ జిల్లాల బదిలీలు జరిగాయి.

నేటి నుంచే ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

తాజా ఉత్తర్వుల నేపథ్యంలో గతంలో అంతర్ జిల్లాల బదిలీ కోసం ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలన్నీ రద్దయినట్టేనని, ఆ మేరకు కొత్తగా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని విద్యా శాఖ సూచించింది. నిర్దేశిత మార్గదర్శకాల మేరకు అంతర్ జిల్లాల బదిలీకి అర్హతలున్న స్పౌజ్, మ్యూచువల్ కేటగిరీ ఉపాధ్యాయులంతా లీప్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకుని, అప్లికేషన్ ప్రింటవుట్‌ను, సంబంధిత డాక్యుమెంట్లు/సర్టిఫికెట్లను జత చేసి సంబంధిత మండల విద్యాశాఖాధికారికి అందజేయాలి. వాటిని తమ వద్ద వున్న ఒరిజినల్ రికార్డులతో ఎంఈవో/డీవైఈవో/హెచ్ఎం సరిపోల్చుకుని ధ్రువీకరించుకోవాలి. దరఖాస్తుల స్వీకరణ గురువారం నుంచి ఈ నెల 24 వరకు ఉంటుంది. దరఖాస్తు ప్రింటవుట్ల పరిశీలనను 22 నుంచి 25 లోగా ఎంఈవోలు పూర్తి చేసి, 26లోగా డీఈవో వెరిఫికేషన్ నిమిత్తం అందజేస్తారు. వాటిని డీఈవోలు విద్యాశాఖ డైరెక్టర్‌కు 27న అందజేయాలి. తుది పరిశీలన, ఫైనలైజేషన్ ప్రక్రియలను 28, 29 తేదీల్లో డైరెక్టరేట్‌లో పూర్తి చేసి, స్పౌజ్, మ్యూచువల్ బదిలీలకు అర్హుల తుది జాబితాను 30న ప్రభుత్వానికి సమర్పిస్తారు. బదిలీల ఖరారుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది.

స్పౌజ్, మ్యూచువల్ బదిలీలు వీరికే..

ఈ ఏడాది జూలై 31వ తేదీ నాటికి కనీసం రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ప్రభుత్వ/జడ్పీ/మున్సిపల్/నగర పాలక సంస్థ యాజమాన్యాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు అంతర్ జిల్లాల బదిలీకి దరఖాస్తు చేసుకునేందుకు అర్హులే. ఆ మేరకు ఉపాధ్యాయుని జీవిత భాగస్వామి (స్పౌజ్) రాష్ట్ర/ కేంద్ర ప్రభుత్వ లేదా రాష్ట్ర/ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, విశ్వవిద్యాలయాలు, శాఖాధిపతులు, స్థానిక సంస్థల్లో పనిచేస్తున్నట్టయితే అంతర్ జిల్లా బదిలీని అభ్యర్థించవచ్చు. బదిలీ అయిన నూతన జిల్లాలో సీనియార్టీ జాబితాలో చివరన ఉండటానికి అభ్యంతరం లేదని దరఖాస్తుదారు తన అంగీకారాన్ని ముందుగానే తెలపాలి. జీవిత భాగస్వామి వద్దకు బదిలీ కోరుకునే ఉపాధ్యాయునికి సంబంధిత జిల్లాలో నిర్దేశిత కేటగిరీ, ఒకే మేనేజ్‌మెంట్‌లో క్లియర్ వెకెన్సీ అందుబాటులో ఉంటేనే బదిలీ అభ్యర్థనకు అర్హత ఉంటుంది. ఇవే నియమాలు వేర్వేరు జిల్లాల సింగిల్ టీచర్ల పరస్పర బదిలీలకు వర్తిస్తాయి. ఆ ప్రకారం పరస్పర బదిలీ కోరుకునే టీచరు అదే కేటగిరీ, సబ్జెక్టు, మేనేజ్‌మెంట్, క్లియర్ వెకెన్సీలో పనిచేస్తున్న వేరే జిల్లా ఉపాధ్యాయుని మధ్యే జరుగుతుంది. అనధికారికంగా స్కూలు విధులకు గైర్హాజరవుతున్న టీచరు, సస్పెన్షన్‌లో ఉన్న ఉపాధ్యాయులకు అంతర్ జిల్లాల బదిలీలు వర్తించవు.



యూరియా.. పాట్లు

యూరియా కొరతతో చిన్న, సన్నకారు రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జీలుగుమిల్లిలో నాల్గు రోజుల క్రితం సొసైటీకి వచ్చిన యూరియా నిల్వలు ఉన్నట్టుండి తరిగిపోయాయి. పలు ఎరువుల దుకాణాల్లోను యూరియా లేదని బుధవారం బోర్డులు పెట్టారు. కొందరు యూరియా తప్ప ఇతర ఎరువులు అమ్ముతున్నారు.

జీలుగుమిల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వరి సాగు చేసే రైతులు ప్రస్తుతం ఏదో ఒక కాంప్లెక్స్(20:20) ఎరువుతో పాటు యూరియాను తప్పనిసరిగా వాడతారు. పంటలకు కావాల్సిన ఎరువులు సకాలంలో అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడుకు చెందిన చిర్రి బాలరాజు ఎకరం పొలంలో ఇటీవల కురిసిన వర్షాలకు వరి నాట్లు వేశాడు. ఎరువుల కోసం కామయ్యపాలెం డీసీసీబీ ఎరువుల దుకాణంలో యూరియా లేదనటంతో 20:20 రకం ఎరువుల కట్ట తెచ్చుకున్నాడు. దీనికితోడు యూరియా కోసం జీలుగుమిల్లి సొసైటీ, పలు ఎరువుల దుకాణాలు తిరిగి చేసేది లేక ఇంటికి వెళ్లాడు. మరోవైపు కొందరు షాపు యజమానులు యూరియాను సమీప సరిహద్దు రాష్ట్రం తెలంగాణకు, మరికొందరు తాళ్ల పూడి, గోపాలపురం మండలాలకు అధిక ధరకు అమ్ముకునే క్రమంలో గుట్టుచప్పుడు కాకుండా ట్రక్కు ఆటోలపై తీసుకెళుతున్నారు. సొసైటీలో యూరియా సైతం కొందరు బినామీ రైతుల పేర్లతో తక్కువ ధరకు కొనుగోలు చేసి షాపు యజమానులు ఎక్కువ ధరకు అమ్ముతున్నారు.

మండల వ్యవసాయ అధికారి ఏమన్నారంటే..

మండల వ్యవసాయాధికారి కె.గంగాధరంను వివరణ కోరగా యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం. అధిక ధరకు ఎవరైనా యూరియా విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురండి. రైతులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో బిల్లులు తీసుకోవాలన్నారు. మండలంలో 6 టన్నుల యూరియా నిల్వ ఉన్నట్లు చెప్పారు.

యూరియా దొరకడం లేదు



జీలుగుమిల్లి మండలంలో బుధవారం ఒక యూరియా కట్ట కోసం కామయ్యపాలెం, పి.అంకంపాలెం, జీలుగుమిల్లిలో సుమారు 10 ఎరువుల దుకాణాలకు తిరిగా. ఎక్కడా యూరియా లేదన్నారు. ఇతర ఎరువులు కొంటే యూరియా ఇస్తామని ఓ షాపు యజమాని చెప్పాడు. అప్పటికే వరి పంటకు 20:20 రకం ఎరువు 50 కిలోల కట్ట కొన్నాను. చేసేది లేక వెనుతిరగాల్సి వచ్చింది.

- పండు బాలరాజు, రైతు, బర్రింకలపాడు

'స్త్రీ శక్తి పథకానికి అపూర్వ స్పందన'



ఏలూరు రూరల్, ఆగస్టు 20(ఆంధ్ర జ్యోతి):స్త్రీ శక్తి పథకానికి అపూర్వ స్పందన లభిస్తోందని ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు తెలిపారు. బుధవారం జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్న స్త్రీ శక్తి ప్రభుత్వానికి భారం కాదు, బాధ్యత అని అన్నారు. పథకం విజయవంతం కావడంతో ఆ పార్టీ తట్టుకోలేక తప్పుడు విమర్శలు చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సరాసరి రోజుకు రాష్ట్రంలో 18 లక్షల మంది చొప్పున మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకున్నారన్నారు. ఈ పథకం ద్వారా మహిళా ప్రయాణికులకు రోజుకు రూ.6.30 కోట్లు లబ్ది చేకూరుతుందన్నారు. ముఖ్యంగా ఆసుపత్రులకు, పుణ్య క్షేత్రాలకు వెళ్ళేవారు, చిరుద్యోగాలు చేసే మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. డిప్యూటీ మాజీ మేయర్ ప్రసాద్, నగర ప్రధాన కార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సైనిక కుటుంబాల కోసం లీగల్ సర్వీసెస్ క్లినిక్ ప్రారంభం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీదేవి

ఏలూరు క్రైం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):దేశ రక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్న సైనికులు, మాజీ సైనికులకు వారి కుటుంబ సభ్యులకు న్యాయ సేవలు అందించాలనే ఉద్దేశంతో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వీరపరివార్ సహాయత యోజన 2025ను ప్రారంభించిందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి అన్నారు. ఏలూరు శనివారపుపేట రోడ్డు శ్రీరామ్‌నగర్ 6వ రోడ్డులో జిల్లా సైనిక వెల్ఫేర్ ఆఫీస్‌లో లీగల్ సర్వీసెస్ క్లినిక్‌ను ఏర్పాటు చేయగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి బుధవారం ప్రారంభించారు. ఈ లీగల్ సర్వీసెస్ క్లినిక్‌లో ఒక ప్యానల్ న్యాయవాది, పారాలీగల్ వలంటీర్లను నియమించడం జరిగిందని వీరు ప్రతి బుధ, శనివారాల్లో అందుబాటులో ఉంటారని సమస్యలు ఎదురైనా, న్యాయ సలహాలు అవసరమైనా వీరిని సంప్రదించవచ్చన్నారు. లేదా అన్ని పని దినాల్లో జిల్లా కోర్టులో ఉన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చునని లేదా 15100కు కాల్ చేసి తమ సమస్యకు పరిష్కారాన్ని తెలుసుకోవచ్చునన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్, ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారామ్, జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్ కొండలరావు, మాజీ సైనిక ఉద్యోగుల యూనియన్ ప్రెసిడెంట్ కె.భాస్కరరావు పలువురు పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు క్రైం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సెక్రటరీ ఏపీ స్టేట్ అలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషన్స్ డిప్లమో ఇన్ పారామెడికల్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఏలూరు ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ పి.సావిత్రి తెలిపారు. ఇంటర్మీడియట్ అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు వచ్చే నెల 8వ తేదీ సోమవారం సాయంత్రం 5గంటలలోపు(ఆఫీసు పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు) ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో రూ.100 రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ పి.సావిత్రి తెలిపారు. దరఖాస్తులు పూర్తి చేసి అందించాలని అన్నారు. దరఖాస్తుదారులు స్వయంగా మాత్రమే ఏలూరు వైద్య కళాశాలలో అందజేయాలని ఆమె కోరారు. పోస్టు ద్వారా తీతీతీ.ఇట్బజి ఇఛి.ఛొ.జీ వెబ్ సైట్‌లో లభించును. పారామెడికల్ కోర్సులకు ఇంటర్మీడియల్ లేదా తత్సమాన విద్యార్హత కలిగిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్, బైపిసి, ఎంపీఈసీ, చదివిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. తదుపరి ప్రాధాన్యత మిగిలిన గ్రూపుల వారికి ఇస్తామన్నారు.

భర్తతో గొడవపడి భార్య ఆత్మహత్య



పోలవరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):భర్తతో గొడవపడి ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పోలవరం మండల కేం ద్రంలో మంగళవారం రాత్రి జరి గింది. పోలవరం ఎస్ఐ పవన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పాతపట్టిసీమ గ్రామానికి చెందిన కిలపర్తి విజయ(40) తన భర్త శేఖర్‌తో పోలవరంలో నివాసం ఉంటోంది. ఇటీవల కన్నాపురం అడ్డరోడ్డు వద్ద ఉన్న వారి పాన్‌షాపు ఆక్రమణలో తొలగించడం, జీవనోపాధి దెబ్బతినడంతో తన భర్తతో రాజమహేంద్ర వరం వెళ్లి అక్కడే వ్యాపారం చేసుకుందామనే విషయమై భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరుగుతోంది. ఈ క్రమంలో మనస్థాపానికి గురైన విజయ రాత్రి 8 గంటల సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుమారుడు కిలపర్తి ఈశ్వర సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. పోల వరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్టు పోలీసులు తెలిపారు.

బంగారం, నదగు చోరీ

భీమడోలు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):భీమడోలులోని ఓ ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చొరబడి తాళాలు బద్దలుకొట్టి ఆరు కాసుల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు.భీమడోలు గుర్రాల చెరువుగట్టు వద్ద ఉంటున్న దూబా లక్ష్మణరావు భార్య నీలవేణి ఈ నెల 19న ఇంటికి తాళాలు వేసి కూలి పనులకు వెళ్లారు. పని ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి రాగా తలుపులు తీసి బీరువా తాళాలు బద్దలు కొట్టి బంగారు ఆభరణాలు, కొంత నగదు పట్టుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు..

స్నేహితుడిని కాపాడబోయి ఒకరి మృతి



దెందులూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): బహిర్భూమికి కలిసి వెళ్లిన ఇద్దరు స్నేహితుల్లో ఒకరు కాలుజారి చెరువులో పడగా అతడిని కాపాడేందుకు దిగి మరో స్నేహితుడు తిరిగిరానిలోకాలకు వెళ్లాడు. దెందులూరు మండలం కొవ్వలి గ్రామానికి చెందిన రాహుల్, అభిషేక్ (18)లు కలిసి బుధవారం సాయంత్రం కొవ్వలిలోని చెరువు గట్టుకు బహిర్భూమికి వెళ్లారు. ప్రమాదవశాత్తు రాహుల్ చెరువులో పడిపోవ డంతో రక్షించేందుకు అభిషేక్ చెరువులోకి దిగాడు. లోతు ఎక్కువగా ఉండటంతో మునిగి ఊపిరాడక అభిషేక్ మృతి చెందాడు. స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చోరీకి యత్నించిన బాలుడి అరెస్టు

యలమంచిలి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):దొడ్డిపట్ల గ్రామానికి చెందిన బాలుడు(16) చోరీకి యత్నించి బుధవారం పోలీసులకు పట్టుబడ్డాడు. దొడ్డిపట్ల గ్రామానికి చెందిన చేగొండి నాగవేణి ఇంట్లోకి బాలుడు వెళ్లి ఆమెపై కత్తితో దాడిచేసి మెడలోని బంగారాన్ని తస్కరించే యత్నం చేశాడు. బాలుడు కత్తితో దాడి చేయడంతో నాగవేణి కేకలు వేయగా చుట్టపక్కలవారు వచ్చి బాలుడుని పట్టుకున్నారు. అనంతరం నాగవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.గుర్రయ్య తెలిపారు.

ఆపరేషన్ ట్రేస్‌లో బాలుడి అప్పగింత



తాడేపల్లి నుంచి బాలుడి కోసం వచ్చిన మేనత్త

ఏలూరు క్రైం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):ఆపరేషన్ ట్రేస్‌లో భాగంగా ఎనిమిదేళ్లుగా చిల్డ్రన్ హోమ్‌లో ఉంటున్న బాలుడిని అతని బంధువులకు అప్పగించామని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, శక్తి టీం ఇన్‌చార్జి సీఐ ఎం.సుబ్బారావు తెలిపారు. ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు ఆపరేషన్ ట్రేస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 13 మంది బాల బాలికలను వారి వారి తల్లిదండ్రులకు, బంధువుల వ ద్దకు చేర్చామన్నారు. చిల్డ్రన్ హోమ్‌లో గత 8 సంవత్సరాలుగా ఉంటున్న నాగరాజు అనేబాలుడి బంధువులను గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఉన్నట్టు గుర్తించామన్నారు. ఈ సమాచారాన్ని వారి బంధువులకు ఇవ్వడంతో బాలుడి మేనత్త బుధవారం మధ్యాహ్నం ఏలూరు సమీ పంలోని శనివారపుపేటలో ఉన్న ప్రభుత్వ వసతి గృహానికి వచ్చారు.ప్రస్తుతం అతను చదువు మధ్యలో ఉండడంతో చదువు పూర్తయ్యాక ఆమెతో పంపేందుకు చిల్డ్రన్ అధికారులు సరేనన్నారు. 8 ఏళ్ల తర్వాత తన అత్తను చూసేందుకు రావడంతో ఆ బాలుడు అమిత సంతోషంలో మునిగితేలాడు. శనివారపుపేట ప్రభుత్వ బాలుర వసతి గృహం సూపరింటెండెంట్ శ్రీవల్లి, శక్తి టీం కానిస్టేబుల్ సుజాత కానిస్టేబుల్ గోపాల కృష్ణ చిల్డ్రన్ హోమ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఏడుగురికి గాయాలు

ఏలూరు క్రైం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):బంధువు మరణించడంతో కడచూపు కోసం కొంత మంది ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌కు తెల్లవారుజామున దిగారు. అక్కడి నుంచి ఆటో మాట్లాడుకుని వెళ్తుండగా మార్గమధ్యలో కుక్క అడ్డువచ్చింది. దీంతో ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న వారిలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా మరో ఆరుగురు గాయాలపాలయ్యారు. ఏలూరు శనివారపుపేటలో ఒకరు మరణించగా వారి బంధువులు విజయనగరం నుంచి బయల్దేరి బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో దిగారు. అక్కడ ఏలూరు బావిశెట్టివారి పేటకు చెందిన ఆటో డ్రైవర్ పోలాపు కనకారావు ఆటోలో విజయనగరం గంటియాడ మండలం కోటూరు బ్రిడ్జి గ్రామానికి బండారి సింహాచలం, బోను జయపార్వతి, బంగారు మహలక్ష్మి, బంగారు లక్ష్మి, బండారు ఆశనికి, బంగారు కన్నమనాయుడు, బోను నాగ విజయలక్ష్మిలు, మరో ఇద్దరు కలిసి కనకారావు ఆటో ఎక్కారు. ఆటో పెద్ద రైల్వే స్టేషన్ నుంచి శనివారపుపేటకు వెళ్తుండగా మార్గమధ్యలో అమీనాపేట సెంటర్ లోబ్రిడ్జి వద్ద ఒక కుక్క అడ్డువచ్చింది. దీంతో ఆటో డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కనకారావు తీవ్ర గాయాలు కాగా ఆరుగురు ప్రయాణికులు గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఏలూరు త్రి టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్ బాబాయ్ కాదండోయ్.. గజదొంగ

భీమవరం క్రైం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అందరితో మమేకమవుతూ టిఫిన్ వ్యాపారం చేసే ఒక వ్యాపారి దొంగ అవతారం ఎత్తాడు. పోలీసుల దర్యాప్తులో సైతం నమ్మలేని నిజాలు బయట పడటంతో అంతా అవాక్కయ్యారు. భీమవరం అంబేద్కర్ సెంటర్ సమీపంలో ఒక వ్యక్తి కొన్నేళ్లుగా టిఫిన్ వ్యాపారం చేస్తున్నాడు. అందరితో ఎంతో ఆప్యాయంగా మాటలు కలుపుతూ టిఫిన్ వ్యాపారం చేసేవాడు. ఇటీవల క్రికెట్ పందేలు, జూదాలతో అప్పుల పాలైనట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే దొంగ అవతారం ఎత్తి చాలా దొంగతనాలు చేసినట్టు చెబుతున్నారు. ఒంటరిగా ఉండే మహిళల ఇళ్లకు వెళ్లి మంచినీళ్లు ఇవ్వమని అడిగి, వారి నుంచి మెడలో ఉన్న బంగారు వస్తువులను లాక్కుని పరారవుతున్నట్టు చెబుతున్నారు. భీమవరం పట్టణంలో రెండు, అలాగే అమలాపురం, భీమవరం చుట్టు పక్కల ప్రాంతాల్లో సుమారు 20కి పైగా చోరీ కేసులు అతనిపై ఉన్నట్టు సమాచారం. ప్రస్తుతం నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని బంగారం రికవరీ చేసే పనిలో ఉన్నట్టు తెలుస్తుంది. చాలా మంది పోలీసులు ఇతడి వద్దే టిఫిన్ చేసేవారని, ఇంత నేర చరిత్ర ఉందని తెలియడంతో పోలీసులే అవాక్కవుతున్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో మోసం

ఏలూరు క్రైం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఆన్ లైన్‌లోని టెలిగ్రామ్ యాప్‌లో ఆన్‌లైన్ ట్రేడింగ్ చేసి పెట్టుబడులు పెట్టి మోసపోయిన బాధితురాలు ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు బీడీ కాలనీకి చెందిన పి.హరిప్రియ ఈ నెల 17న టెలిగ్రామ్ యాప్‌లో ఆన్‌లైన్ ట్రేడింగ్ చేశారు. ఆమెకు డబ్బులు వచ్చినట్లుగా యాప్‌లో కనిపించాయి. అవి రావాలంటే 16 వేలు ప్రోసెస్ ఫీజు చెల్లించాలని చెప్పారు. ఇండియా టాక్స్ కట్టాలని క్యాష్ బిల్లు చేయాలని దఫదఫాలుగా మూడు లక్షల 93 వేల రూపాయలు ఆన్‌లైన్ పేమెంట్ల ద్వారా కట్టించుకున్నారు. అయితే తాను మోసపోయానని బాధితురాలు గుర్తించి ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేబుల్ వైర్లు స్వాధీనం

చోరీల పట్ల రైతుల్లో ఆందోళన

ముసునూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ముసునూరు సింగరాజుకుంటలో వ్యవసాయ బోర్లకు సంబంధించిన కేబుల్ వైర్లు బుధవారం బయటపడ్డాయి. తుప్పచాటున కేబుల్ వైర్లు గుట్టగా ఉండటం చూసి పశువుల కాపరులు సమాచారం ఇవ్వగా పోలీసులు వచ్చి వాటిని స్వాధీనం చేసుకున్నారు. పక్కనే కొన్ని కేబుల్ వైర్లను కాల్చి వాటిలోని రాగి వైర్‌ను అపహరించినట్టు గుర్తించారు. ఇటీవల ముసునూరులో 10 వ్యవసాయ బోర్లకు సంబంధించి రూ.లక్షా 50 వేల విలువ గల సామగ్రిలో రాగివైర్లను దుండగులు అపహరించుకుపోయినట్లు బాధిత రైతులు తెలిపారు. సింగరాజుకుంటలో దొరికిన కేబుల్ వైర్లను బట్టి ఈ చోరీల్లో స్థానికుల హస్తం ఉంటుందనే అనుమానాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. రాగివైర్ల చోరీపై ఎస్పీ శివకిశోర్ ఆదేశాల మేరకు ఎస్ఐ ఎం.చిరంజీవి పర్యవేక్షణలో ప్రత్యేక నిఘా పెట్టినా వ్యవసాయ బోర్ల సామగ్రి, రాగివైర్ల చోరీలు జరుగుతుండటం విశేషం. చోరీలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

చింతలపూడి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రేచర్ల సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డుపై బుధవారం రాత్రి రెండు మోటార్‌సైకిళ్లు ఢీకొన డంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఇందులో సీతానగరానికి చెందిన హరిప్రసాద్, నాగలక్ష్మిలను జంగారెడ్డిగూడెం తరలించారు. మరోవ్యక్తి రాఘవాపురం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఇతనిని చింతలపూడి ఏరియా ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అధికారులను అప్రమత్తం చేశారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి

టి.నర్సాపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):ఒంగోలులో ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు జరుగుతున్న సీపీఐ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. మక్కినవారిగూడెంలో ఏఐటీయూసీ కార్యాలయం వద్ద టి.నర్సాపురం, మండల విస్తృతస్థాయి సమావేశం సీపీఐ జిల్లా సమితి సభ్యులు బి.ఎస్.సాగర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిధిగా వచ్చేసిన కృష్ణ చైతన్య మాట్లాడుతూ మహాసభలకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో బహిరంగ సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

గో సంరక్షణకు పది టన్నుల దాణా వితరణ



ద్వారకాతిరుమల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న గోసంరక్షణ ట్రస్టునకు ఓ దాత 10 టన్నుల గోదాణాను విరాళంగా అందించారు. మూలపాడుకు చెందిన నిమ్మగడ్డ వెంకటేశ్వర రావు పది టన్నుల గోదాణాతో బుధవారం క్షేత్రానికి వచ్చారు. స్వామి దర్శనానంతరం వాటిని తీసుకుని గోశాల వద్దకు వెళ్లి సిబ్బందికి అందించారు.

డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లకు 26 వరకు గడువు

ఏలూరు అర్బన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 26లోగా ఆన్‌లైన్ విధానంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు తెలిపారు. రిజిస్ట్రేషన్ల నిమిత్తం విద్యార్థులకు సహకరించేందుకు వీలుగా కళాశాలలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసామన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు వాయిదా వేయండి

ఏలూరు అర్బన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల రిటైర్మెంట్లు ఈ నెల 30న ఎక్కువగా ఉన్నందున వారిని సన్మానించేందుకు వీలుగా ఆ రోజున నిర్వహించతలపెట్టిన స్కూల్ కాంప్లెక్సు సమావేశాలను మరో రోజుకు వాయిదా వేయాలని ఏపీటీఎఫ్-1938 నాయకులు జి.కృష్ణ, రామ్మోహన్‌రావు, మోహన్‌రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ చేసిన వారిని సత్కరించి, వీడ్కోలు పలికేందుకు స్కూలు, మండలంలోని టీచర్లందరూ హాజరుకావడం సంప్రదాయమైనందున ప్రభుత్వం పునరాలోచించి స్కూల్ కాంప్లెక్సు మీటింగ్స్‌ను వేరే రోజుకు వాయిదా వేయాలని కోరారు.

సెయింట్ థెరిస్సాలో విద్యార్థి సంఘ ప్రమాణ స్వీకారం

ఏలూరు అర్బన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థి సంఘానికి ఎన్నికైన నాయకులు విలువలను కాపాడుకుంటూ, అందరితో సమైక్యంగా మెలగాలని జిల్లా ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల నోడల్ అధికారి, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.గిరిబాబు సూచించారు. ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ కళాశాలలో ప్రస్తుత విద్యాసంవత్సరానికి నూతనంగా ఎన్నికైన విద్యార్థినుల సంఘం ప్రమాణస్వీకార కార్యక్రమం బుధవారం జరిగింది. గిరిబాబుతో పాటు కళాశాల సుపీరియర్, కరస్పాండెంట్ మదర్ ఎర్నెస్టైన్ ఫెర్నాండెజ్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన విద్యార్థి సంఘ నాయకులు నిష్పక్షపాతంగా, నిజాయితీగా పనిచేయాలన్నారు. విద్యార్థినుల సంఘ ప్రెసిడెంట్ జ్ఞాని జైన్, కార్యదర్శి లతిక, ఉపాధ్యక్షురాలిగా దివ్య, ఉప కార్యదర్శిగా హైందవి ఎన్నికయ్యారు. వీరితో ప్రమాణస్వీకారం చేయించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్లు డాక్టర్ శ్రీలత, దీప్తిభార్గవ, అనూష, తదితరులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనపై క్విజ్ పోటీ

ఏలూరు అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దోమల నివారణ దినాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ మలేరియా, ఇమ్యునైజేషన్ విభాగాల ఆధ్వర్యంలో స్థానిక కోటదిబ్బ కస్తూరిబా మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శోభ మాట్లాడుతూ మానవ సమాజాన్ని మలేరియా నుంచి కాపాడిన డాక్టర్ రోనాల్డ్ రోస్ మహనీయుడని పేర్కొన్నారు. దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యార్థినులకు క్విజ్ పోటీ నిర్వహించి బహుమతులు అందజేయడంతో పాటు, ర్యాలీ నిర్వహించారు. తొలుత రొనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ల జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రోహిత్, వైద్యాధికారి నీలిమ, అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరరావు, స్కూలు హెచ్‌ఎం పాల్గొన్నారు.

అనుకున్న లక్ష్యం కంటే ముందే క్షయవ్యాధి నిర్మూలన

చింతలపూడి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన 2030 లక్ష్యాన్ని భారత్‌లో 2025 నాటికే చేరినట్టు ఎంపీహెచ్‌ఎస్ ప్రభాకర్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు జాతీయ క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిని అనుకున్న లక్ష్యం కంటే ఐదేళ్ల ముందే అరికట్టగలిగామన్నారు. క్షయ రోగులందరికీ ఉచిత నిర్ధారణ పరీక్షలు, చికిత్స, ఔషధాలు వంటివి నిర్వహించడమే కాకుండా రోగుల పోషణ కోసం నెలకు వెయ్యి రూపాయలు అందిస్తారని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో క్షయ వ్యాధి ఒక ప్రధాన ఆరోగ్య సమస్యని, దీని నిర్మూలకు కృషి జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించగా ఆరోగ్య సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

వచ్చే నెల 13న మెగా లోక్ అదాలత్

చింతలపూడి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 13న జరిగే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సి.హెచ్.మధుబాబు తెలిపారు. బుధవారం కోర్టు ఆవరణలో పోలీస్ అధికారులతో లోక్ అదాలత్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పెండింగ్ కేసుల పరిష్కారం, క్రిమినల్, సివిల్ వంటి కేసులు రాజీపడదగ్గ కేసులు పరిష్కారం చేసుకోవచ్చని తెలిపారు. దీనివల్ల సొమ్ము, సమయం ఆదా అవుతుందన్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి.క్రాంతి కుమార్, ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.అశోక్, ధర్మాజీగూడెం, తడికలపూడి, చింతలపూడి, టి.నర్సాపురం ఎస్‌ఐలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సరవేగంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు.ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడుతున్నామన్నారు. ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కారం అవుతుండటంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. రానున్న కాలంలో మరిన్ని సేవలు ప్రజలకు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణసౌకర్యాలు కల్పించడం పట్ల మహిళలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు.

ఆయిల్ పామ్ గెలలు కోసే సమయంలో జాగ్రత్తలు అవసరం

టి.నర్సాపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ గెలలు కోసేటప్పుడు రైతులు, కార్మికులు భద్రత నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని ఎస్.ఐ. జయబాబు తెలిపారు. స్థానిక శివాలయ కల్యాణ మండపంలో బుధవారం ఆయిల్ పామ్ రైతులు విద్యుత్ శాఖ, నవభారత్ కంపెనీ సమన్వయంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయిల్ పామ్ పంట కోత సమయంలో అనుసరించాల్సిన భద్రతపై అవగాహన కల్పించారు. విద్యుత్ శాఖాధికారులు మరణాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. నవభరత్ కంపెనీ యాజమాన్యం భద్రతా చర్యలను అమలు చేయడంలో వారి సహకారం అందిస్తామన్నారు. విద్యుత్ తీగల వద్ద ఆయిల్ పామ్ గెలలు కోయరాదన్నారు. అవసరమైతే విద్యుత్ శాఖకు సమాచారమిచ్చి విద్యుత్ సరఫరా నిలిపివేయించాలని, గెలులు నరికేందుకు ఇనుపకత్తులు ఉపయోగించరాదని, రబ్బర్ గ్లౌజ్, బూట్లు, వంటివి ధరించి పని చేయాలని ఒక్కరే కాకుండా ఇద్దరు అంతకంటే ఎక్కువ మంది కలిసి పని చేయాలని విద్యుత్ ప్రమాదం జరిగినప్పుడు వెంటనే 108అంబులెన్స్ విద్యుత్ శాఖకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాస్, పలువురు ఆయిల్ పామ్ సాగు రైతులు పాల్గొన్నారు.

గోదావడి వడిగా..

(5వ పేజీ తరువాయి)

అన్ని ఏర్పాట్లు చేశాం. విపత్తులశాఖ ఇచ్చే సూచనలతో ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. పునరావాస కాలనీల్లో 30 టాయిలెట్లను సిద్ధం చేశాం. ఇప్పటికే 9 మోటార్లు ద్వారా పనిచేసే బోర్ల ద్వారా తాగునీటిని అందించడానికి సిద్ధం చేశాం. వైద్యబృందాలను ఏర్పాటు చేశాం. విద్యుత్, రవాణా సౌకర్యాలకు అన్ని చర్యలు తీసుకున్నాం. శాశ్వత ప్రాతిపదికన ముంపు మండలాల ప్రజల కోసం తాజాగా కాలనీల్లో ఏర్పాట్లకు రోడ్లు, ఇతర సౌకర్యాలకు టెండర్లు పిలిచాం'అని తెలిపారు.

కొల్లేరు ఉప్పుటేరు ఆక్రమణల తొలగింపు..

కొల్లేరు పరీవాహక ప్రాంతంలో ఉప్పుటేరు నుంచి వరదనీరు బయటకు పోయేందుకు వీలుగా ఆయా పరిసర ప్రాంతాల్లో ఆక్రమణలు, గుర్రపుడెక్క తూడు తొలగింపును చేపడుతున్నట్టు కలెక్టర్ తెలిపారు. సుప్రీం సాధికారిక కమిటీ ఆదేశాల మేరకు ఉప్పుటేరు వరద నివారణకు అన్ని చర్యలను చేపట్టామన్నారు. ఇక మీదట బడ్జెట్‌ను రూపొందించి నిరంతరాయంగా పనులు చేస్తామన్నారు. డీఆర్వో విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.


జిల్లాలో కొనసాగుతున్న వర్షాలు

ఏలూరుసిటీ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీరం దాటినా జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. గత 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా కుక్కునూరు మండలంలో 28 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కాగా సరాసరి వర్షపాతం 3.9 మి.మీ నమోదైంది. వేలేరుపాడు 27.4, భీమడోలు 7.8, పోలవరం 4.6, జీలుగుమిల్లి 4, బుట్టాయిగూడెం 4, లింగపాలెం 3.8, ముసునూరు 3.2, నిడమర్రు 3 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి. జిల్లాలో వర్షం కురిసిన మిగిలిన మండలాల్లో మూడు మిల్లీ మీటర్లు కన్నా తక్కువగా వర్షపాతం నమోదైంది.

సెంట్రల్ లైటింగ్‌కు మోక్షం

- 15 ఏళ్ల నాటి ప్రాజెక్టులో కదలిక
- ముమ్మరంగా సాగుతున్న పనులు
- తీరనున్న చింతలపూడి వాసుల కల

చింతలపూడి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): చింతలపూడి నగర పంచాయతీలో 15 ఏళ్లుగా కదలని సెంట్రల్ లైటింగ్ పనులకు మోక్షం లభించింది. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అమెరికా యాత్ర ముగించుకుని వచ్చిన తరువాత అభివృద్ధి పనులపై దృష్టి పెట్టారు. ఆయన ఎన్నికల్లో ఇచ్చిన హామీలో సెంట్రల్ లైటింగ్‌ను వెలిగిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చుకోబోతున్నారు. నగర పంచాయతీలో కోటి రూపాయలతో 2009లో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ దీపాలు ఏనాడు వెలిగిన దాఖలాలు లేవు. అప్పటి మేజర్ పంచాయతీ అధికారులు ఇవి నాసిరకం కేబుల్స్‌గా ఉన్నాయని,తాము దీనిని అనుమతించలేమని చెప్పడంతో మూలనపడింది. ఇద్దరు ఎమ్మెల్యేలు మారినా ఈ లైట్లు వెలగలేదు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే రోషన్ కుమార్ ఏడాది దాటినా ఆలస్యమైనా ఈ పనులకు శ్రీకారం చుట్టారు. పీపీపీ విధానంలో ఈ దీపాలు వెలిగించేందుకు చేపడుతున్న చర్యలు వేగంగా దూసుకుపోతున్నాయి. పాడైపోయి విరిగిపోయిన స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. ముందుగా అన్ని స్తంభాలను చెక్ చేసి పాడైపోయిన స్తంభాలను తొలగించారు. వాటి స్థానంలో కాంక్రీట్ వేసి స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. మిగిలిన స్తంభాలకు రంగులు వేస్తున్నారు. దీనిపై మునిసిపల్ కమిషనర్ అంబటి రాంబాబు మాట్లాడుతూ సుమారు రూ.28 లక్షలతో నూతన కేబుల్స్ వేశామని, ప్రస్తుతం 80 స్తంభాలకు అదనంగా మరో 20 స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామని, అవసరమైన చోట్ల కాపర్ వైరు వేస్తామన్నారు. అంతేకాక దీపాల యాంగ్లర్స్ ఆధునిక పద్ధతిలో ఎల్‌ఈడీ దీపాలు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. మరో పది రోజుల్లో ఈ పనులను ముగించాల్సి ఉండగా వర్షాల కారణంగా మరో పది రోజులు సమయం పట్టే అవకాశం ఉందని తెలిపారు.



ఏర్పాటు చేస్తున్న స్తంభాలు

నిరుద్యోగుల వద్దకే ఉద్యోగ అవకాశాలు : ఎమ్మెల్యే రోషన్

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగుల వద్దకే ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ద్వారా ఉద్యోగావకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. బుధవారం చిట్టూరి గణేశ్వరరావు టౌన్‌హాల్లో బుధవారం ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ.ఎస్.ఎస్.డీసీ)ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. 13కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొన్నాయి.ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల నుంచి 154 మంది నిరుద్యోగులు హాజరుకాగా 44 మంది వివిధ సంస్థల్లో ఉద్యోగాలు పొందినట్టు జిల్లా ఏపీ.ఎస్.ఎస్.డీసీ అధికారి ఎన్.జితేంద్రబాబు తెలిపారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్, జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ, రాష్ట్ర క్షత్రియ, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్లు నంబూరి రామచంద్రరాజు, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, పరిమి సత్తిపండు, రావూరి కృష్ణ, పెనుమర్తి రామకుమార్, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, జనసేన నాయకురాలు గురుజు ఉమామహేశ్వరి, టీడీపీ మండలాధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, మహంకాళి రామ్మోహనరావు, రాజాన పండు,ప్లేస్మెంట్ అధికారి ప్రవీణ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ప్లాట్ల క్రమబద్ధీకరణపై అవగాహన

ఏలూరుసిటీ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో స్థానిక డీపీఆర్‌సీలో అనధికార లేఅవుట్లు, ప్లాట్లు క్రమబద్ధీకరణపై పంచాయతీ కార్యదర్శులు, డిప్యూటి ఎంపీడీవో, డీఎల్‌పీవోలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు డీపీఓ కె.అనూరాధ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ అనధికార లే అవుట్లు,ప్లాట్ల క్రమబద్ధీకరణకు అర్హతా ప్రమాణాలు, దరఖాస్తులు చేసే విధానం, ఎవరెవరు అర్హులు, చార్జీల వివరాలపై అవగాహన కల్పించారు. జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు, డిప్యూటీ ఎంపీడీవోలు, డీఎల్పీవోలు పాల్గొన్నారు.

నీట్ పీజీలో అజయ్‌కి 794వ ర్యాంకు



టి.నర్సాపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపోతేపల్లి గ్రామానికి చెందిన ఎం.పూర్ణసాయి అజయ్‌కి నీట్ పీజీలో 794వ జాతీయ ర్యాంకు వచ్చింది. రాజుపోతేపల్లికి చెందిన పూర్ణసాయి అజయ్ ఇంటివద్దే చదివి ఇటీవల జరిగిన నీటి పీజీ ప్రవేశపరిక్ష రాశాడు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో 794వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు.

ఆలయాల్లో శ్రావణమాసం పూజలు



గణపతిస్వామి

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సత్రం పాడులోని లక్ష్మీగణపతి స్వామి ఆలయంలో శ్రావణమాసం నేపథ్యంలో భక్తులు స్వామికి విశేష పూజలు నిర్వహించారు. గరికతో అర్చన జరిపి బెల్లం నివేదనలు సమర్పించారు. ఆలయ అర్చకులు రెండు చింతల రాఘవేంద్రశర్మ స్వామికి పంచామృతాభి షేకం జరిపి అనంతరం విశేష అలంకరణ నిర్వ హించి ప్రత్యేక హారతులిచ్చి భక్తులకు దర్శనమి చ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని గణనాథ స్తోత్రాలను పఠించారు. ఆలయ ఈవో సి.హెచ్.చిననాగేశ్వరరావు, సిబ్బంది భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

రాజీవ్ గాంధీ జయంతి

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని బుధవారం స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి వేడుక జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులోనే భారత ప్రధానిగా రాజీవ్‌గాంధీ అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించారని, దేశంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అభివృద్ధి చేయడం, పంచాయతీరాజ్ శాఖలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి పంచాయతీలకు కేంద్రం నుంచి నేరుగా నిధులు వచ్చేలా బిల్లు పెట్టి గాంధీ మహాత్ముని గ్రామ స్వరాజ్యం కలను నిజం చేసిన ఘనుడని అన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు ప్రాధాన్యత కల్పించిన నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. నాయకులు ప్రతాప సుబ్రహ్మణ్యశర్మ, లంకా రామ్మోహన్, చక్కా గుప్తా, ఆకుల వెంకన్న, సేవాదళ్ సుబ్బారావు, సాయిబాబు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులూ.. మోసపోకండి

ఏలూరు క్రైం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ నియామక డీఎస్సీ పరీక్షల పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలపై అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఉపాధ్యాయ నియామక పరీక్షలు(డీఎస్సీ) ఫలితాల నేపథ్యంలో కొంత మంది సైబర్ నేరగాళ్లు నేరుగా అభ్యర్థులకు ఫోన్లు చేసి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఫోన్ ద్వారా సంప్రదించి మార్కుల్లో మార్పు చేసి ఉద్యోగం వచ్చేలా చేస్తామని డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఇలాంటి వాటిని నమ్మవద్దన్నారు. ఎవరైనా ఫోన్‌లు చేస్తే దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కుగాని, డయల్ 112కు కాని సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రావణ్‌కుమార్ తెలిపారు.



నగర శాంతి కోసం సుదర్శన హోమం

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలని, నగర ప్రజలు సుఖ సంతోషాలు, పాడి పంటలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, నగరపాలక సంస్థ కో-ఆప్షన్ మెంబర్ ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు బుధవారం ఎస్ఎంఆర్ నగర్‌లోని ఆయన నివాస గృహం వద్ద సుదర్శన హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇదే సందర్భంగా మేయర్ దంపతులు లక్ష్మీనారాయణ స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ద్వారకాతిరుమలకు చెందిన అర్చక బృందం మేయర్ దంపతులతో ఈ కార్యక్రమాన్ని జరిపించారు.



సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

గణపతి ఉత్సవాలకు సహకరించండి

అధికారులను కోరిన ఉత్సవ కమిటీ

ఏలూరు రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వినాయక మండపాల ఏర్పాట్లలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా దిగ్విజయంగా నిర్వహించడం కోసం పోలీస్ యంత్రాంగం సహకరించాలని నూతనంగా ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ కమిటీ ఏలూరు జిల్లా శాఖ అధికారులకు విజ్ఞప్తి చేసింది. కమిటీ సమావేశం ఏలూరులో జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ఉత్సవ కమిటీ ఏర్పాటైంది. గౌరవాధ్యక్షుడిగా పేరిచర్ల రాంబాబు, ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా నారా శేషు, ప్రధాన కార్యదర్శిగా తూతా బాలాజీ కుమార్ ఎన్నికయ్యారు. విలేకరుల సమావేశంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ జిల్లాలో మండపాల ఏర్పాటులో అసౌకర్యం కలగకుండా సింగిల్ విండో పద్ధతిలో అనుమతులు మంజూరు చేసి అన్ని విధాలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. విగ్రహాల నిమజ్జన సమయంలో క్రేన్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మండపాల వద్ద పారిశుధ్య పనులు నిర్వహించేందుకు నగర పాలక సంస్థ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆక్వా రైతులకు అవగాహన

ఏలూరు రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సురక్షితమైన పద్ధతులతో అధిక దిగుబడిని సాధించడం ఎలాగో ఆక్వా సదస్సుల ద్వారా తెలుసుకోవాలని ఏపీ ఫిషరీస్ ఫార్మర్స్ అసోసియేషన్ సెక్రటరీ, పెన్మెత్స బోసురాజు అన్నారు.ఏలూరు గ్రో బెస్ట్ కంపెనీ ఆధ్వర్యంలో ఆక్వా రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ ఆక్వా రైతులను వ్యాపారులను ఎగుమతిదారులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకుంటేనే ఆక్వా రంగం మనుగడ సాధిస్తుందన్నారు. అనంతరం సీనియర్ ఆక్వా కన్సల్టెంట్ డాక్టర్ బి.జగన్మోహనరావు ఆక్వా రంగంలో అధిక దిగుబడిన సాధించేందుకు మేలైన పద్ధతులను వివరించారు. ఏలూరు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ మామిడిపల్లి పార్థసారథి, ఆక్వా రైతు కలిదిండి అప్పల నరసింహరాజు రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్‌విఎస్‌కే వర్మ, కృష్ణంరాజు, నాగ విక్రం, గ్రోబెస్ట్ కంపెనీ సెల్స్ హెడ్ రాజేష్ గోవిందన్, ఎస్ నళియప్పన్ పాల్గొన్నారు.



బోసురాజును సత్కరిస్తున్న దృశ్యం

ఎన్డీఏకు జగన్ మద్దతుపై కాంగ్రెస్ ఫైర్

దెందులూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిని బలపర్చడంలో జగన్ బీజేపీతో కుమ్మక్కయ్యారని దెందులూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ ఆలపాటి నర్సింహమూర్తి ధ్వజమెత్తారు. బుధవారం ఆయన దెందులూరు నియోజకవర్గ క్యాంపు కార్యాలయం మొండూరులో విలేకరులతో మాట్లాడుతూ ఉపరాష్ట్రపతి అభ్యర్థికి వైసీపీ మద్దతు ప్రకటించడంలో ఆంతర్యం ఏమిటని జగన్‌ను ప్రశ్నించారు. ప్రతిరోజూ కూటమిపై ఆరోపణలు చేస్తున్నట్టు నటించే జగన్ ఎందుకు మద్దతు ఇస్తున్నారో ఏపీ ప్రజలకు చెప్పాలని ఆలపాటి డిమాండ్ చేశారు.

ముంపు పొలాల పరిశీలన

పెదపాడు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కొణికి గ్రామం బుడమేర సమీపంలో ముంపునకు గురైన వరి చేలను క్షేత్రస్థాయిలో బుధవారం శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. నాట్లు వేసుకున్న వరిపొలాలన్నీ 20-30 రోజుల కాలపరిమితితో ఉన్నాయని, వర్షాల కారణంగా బుడమేరు సమీపన సాగులో ఉన్న పంటలు నీటి మునిగిన కారణంగా వాటి రక్షణకు పూర్తిస్థాయిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సి ఉందని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (ఏరువాక కేంద్రం) ఏలూరు సమన్వయకర్త డాక్టరు కె.ఫణికుమార్, విస్తరణ శాస్త్రం శాస్త్రవేత్త ఎన్.నాగేంద్ర బాబు తెలిపారు. ముంపును తట్టుకునే యూటీయూ 1232, యంటీయూ 1140 రకాలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. సర్పంచ్ పొట్లూరి యుగందర్, పెదపాడు వ్యవసాయాధికారి షేక్ ఇమామీ ఖాసిం, రైతు సేవా కేంద్రం సిబ్బంది దీపిక పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలి

ఏలూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లింగపాలెం పీహెచ్‌సీ డాక్టర్ కె.రాజశేఖర్ అన్నారు. మండలంలోని ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా చలి జ్వరం, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశముందన్నారు. ఏఎన్ఎంలు, ఆశాలు ప్రతి రోజూ ఇంటింటి సర్వే నిర్వహించాలని సర్వే సమయంలో ఎవరికైనా జ్వరం లక్షణాలుంటే పరీక్షలు చేయించుకోవాలన్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

ఏలూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్టు ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు. లింగపాలెం మండలంలోని అయ్యప్పరాజుగూడెం గ్రామంలో పేకాడుతున్నారనే సమాచారంతో సిబ్బందితో కలిసి దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2,250 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు.

ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల కోసం వినతి

చింతలపూడి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధి కోసం రాష్ట్ర సచివాలయంలోని ముఖ్య కార్యదర్శులను, సాంఘిక సంక్షేమ శాఖా మంత్రిని కలిసి నిధులు కేటాయించాలని కోరినట్టు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తెలిపారు. చింతలపూడి ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు సబ్ ప్లాన్ నిధులు కేటాయించాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డి.బాల ఆంజనేయస్వామిని కోరామని, నిధులు వస్తే రహదారుల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పన కోసం వినియోగిస్తామన్నారు. వీటితో పాటు నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి సాయి ప్రసాద్‌ను సచివాలయంలో కలిసి నియోజకవర్గంలో అనేక సాగునీటి చెరువులు ఉన్నాయని, మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరామని తెలిపారు.

చిన్న తరహా పరిశ్రమలు స్థాపించాలి

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు మహిళలు ముందుకురావాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు.స్థానిక సీహెచ్‌ఆర్ టౌన్‌హాల్లో బుధవారం జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో వివిధ వృత్తి వ్యాపారాల్లో ఆర్థికంగా రాణిస్తున్న మహిళలకు ఎంఎస్ఎంఈ, ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమలు స్థాపించి ఆర్థిక స్వావలంబన సాధించడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తక్కువ వడ్డీతో బ్యాంకుల ద్వారా రుణం పొందే అవకాశాలు ఉంటాయన్నారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్, జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు, పరిమి సత్తిపండు, రావూరి కృష్ణ, పెనుమర్తి రామకుమార్ పాల్గొన్నారు.

బీసీలు, ఎస్సీలకు ప్రాధాన్యం

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): చింతలపూడి నియోజకవర్గంలోని నామినేటెడ్ పదవుల్లో బీసీలు, ఎస్సీలకు అధిక ప్రాధాన్యత కల్పించినట్టు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. బుధవారం జంగారెడ్డిగూడెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం త్రీమెన్ కమిటీ ప్రమాణ స్వీకారం ఎమ్మెల్యే రోషన్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ముందుగా ఎమ్మెల్యే రోషన్‌కుమార్ సమక్షంలో త్రీమెన్ కమిటీ ఛైర్మన్‌గా మానికల నాగేశ్వరరావు, సభ్యులు పాతూరి అంబేడ్కర్, కొంచాడ దుర్గా ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నూతన కమిటీతో ఎమ్మెల్యే ప్రమాణం చేయించారు.

కైకరంలో పారిశుధ్యంపై అవగాహన

ఉంగుటూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఫ్రైడేని డ్రైడేగా నిర్వహించాలని పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం దోమల వల్ల కలిగే నష్టంపై ప్రజలకు అవగాహన కల్పించారు. పూళ్ల ప్రాథమిక వైద్యాధికారిణి డా. అరుణ జ్యోతి ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం మలేరియా యూనిట్ ఆరోగ్య ఉప అధికారి వై.వీ.లక్ష్మణరావు నేతృత్వంలో అవగహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య పర్యవేక్షకులు జి.శ్రీనివాసరావు, ఎం.ఎల్.పి.హెచ్.పి లు జయశ్రీ, ప్రీతి, కార్యకర్తలు జగన్సీ, శైలజ, ఆశాలు పాల్గొన్నారు.

క్షయ నివారణపై అవగాహన

ఏలూరు అర్బన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు నిర్వహించారు. క్షయవ్యాధి నిర్మూలన విధానాలను తెలియజేశారు. పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా క్షయ నియంత్రణావిభాగం వైద్యాధికారి డాక్టర్ దేశాయ్‌నాథ్ భూపతి, పీపీఎం రాష్ట్ర కో-ఆర్డినేటర్ అరుణ భూపతి, కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉంగుటూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు సెక్షన్‌లో భారీ గాలీవానకు పడిపోయిన విద్యుత్ లైన్ల పునరుద్ధరణ నిమిత్తం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖాధికారి అంబేద్కర్ తెలిపారు. ఉంగుటూరులోని గృహ అవసరాలకు పరిశ్రమలకు, తెల్లవారు జామున 3 నుంచి ఉదయం 9గంటల వరకు వ్యవసాయ విద్యుత్‌ను అందిస్తామన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉండాలి

పెదపాడు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటుగా ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని పెదపాడు వైద్యాధికారి డాక్టరు చక్రధర్ సూచించారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలుతున్నాయని, ఎక్కువగా దగ్గు, జలుబు, జ్వరాల బారిన ఇబ్బందులకు గురవుతున్నవారి సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. దీనికి పరిష్కారంగా తమ ఇళ్ల వద్ద, చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్యసేవలను పొందాలన్నారు. పరిసరాల పరిశుభ్రతలో భాగంగా బుధవారం రామచంద్రపురం, పెదపాడు గ్రామాల్లో వైద్యసిబ్బంది పర్యవేక్షణలో బ్లీచింగ్, ఇతర రసాయనాలు పిచికారీ చేయించారు. గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాము, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



బాధ్యత పెరిగింది

(ఏలూరు-ఆంధ్రజ్యోతిప్రతినిధి)

సీఎం కార్యక్రమాల సమన్వయకర్తగా నియమితులైన మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణరాజును ఆప్కాబ్ ఛైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు బుధవారం ఆయన నివాసంలో కలిసి అభినందించారు. ఉమ్మడి జిల్లాలో అందరిని కలుపుకుని పోతూ పార్టీ వ్యవహారాల్లో ఆది నుంచి చురుగ్గా ఉన్న మీకు తగిన ప్రాధాన్యత కలిగిన బాధ్యతే దక్కిందంటూ రాజును కొనియాడారు.



శబరిమలకు చింతమనేని

దెందులూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బుధవారం శబరిమల వెళ్లి అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు.సీతంపేట గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మాజీ బ్యాంక్ అధ్యక్షులు పర్వతనేని రామకృష్ణతో పాటు పలువురితో శబరిమాలై వెళ్లి అయ్యప్పస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వరద బాధితులను ఆదుకోండి

కుక్కునూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గోదావరి వరదల నేపథ్యంలో బాధితులందర్ని ఆదుకోవాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అన్నారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ముంపులో ఉన్న ప్రతీ మండలాన్ని యూనిట్‌గా తీసుకుని నష్టపరిహారం చెల్లించి తరలిస్తే ప్రతీ ఏటా నిర్వాసితులకు ఈ బాధలుండవన్నారు. అలాగే ఒంగోలులో జరిగే 28వ సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు కిశోర్, కొన్నే లక్ష్మయ్య, కే.బాబురావు పాల్గొన్నారు.

కార్మికులను ఆదుకోండి

కుక్కునూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి వై.సాయికిరణ్ అన్నారు. బుధవారం ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యుడిగా భాషను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వలిభాష, షేక్ రఫీ, రాము తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

భీమడోలు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వారోత్సవాల్లో భాగంగా భీమడోలులోని పలు ఆసుపత్రులోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. భీమడోలు సామాజిక వైద్య కేంద్రం, బాలు, దేవి, బెనర్జీ ఆసుపత్రులలోని 125 మంది రోగులకు పండ్లు బ్రెడ్‌లను అందజేశారు. మానవత జిల్లా కమిటీ కన్వీనర్ రామిశెట్టి గంగాధర్, సాంబశివరావు, ఆర్‌డిఎం ప్రసాద్, వెజ్జు ధర్మారావు, ఉన్నమట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

నూజివీడు టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం కావడంతో, దోమల వల్ల ప్రబలే జ్వరాలు, వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోనేరుపేట పీహెచ్‌సీ వైద్యురాలు ఎస్. సాయిసుధ తెలిపారు. జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని, వేడి ఆహారం తినాలని, రోడ్ల వెంట అమ్మే ఫాస్ట్ ఫుడ్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అనారోగ్యం బారిన పడితే వెంటనే ఆసుపత్రికి రావాలని తెలిపారు. మలేరియా యూనిట్ అధికారి యలమంద, హెచ్‌వి కుమారి, రవీంద్ర, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో ఆన్‌లైన్ అడ్మిషన్లు ప్రారంభం

నూజివీడు టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరానికి నూజివీడు ప్రభుత్వ ఐటీఐలో గల వివిధ ట్రేడ్‌లలో ప్రవేశాల కోసం అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు నూజివీడు ఐటీఐ ప్రధాన అధికారి పి. రజిత తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 21.08.2025 ఉదయం 9 గంటల నుంచి 26.08.2025 సాయంత్రం 5గంటల లోపు ప్రభుత్వ ఐటిఐ నూజివీడు నందు హెచ్‌టిటిపి://డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఐటిఐ.ఏపీ.జీవోవి.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పెన్షన్ల పునరుద్ధరణకు వేడుకోలు


ముదినేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో అప్పీల అర్జీలు అందజేస్తున్న దివ్యాంగులు

ముదినేపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి దివ్యాంగ పెన్షన్లు పొందుతూ రీ వెరిఫికేషన్‌లో పెన్షన్ల రద్దుకు గురైన పలువురు దివ్యాంగులు తమ పెన్షన్లు పునరుద్ధరించాలని మండల పరిషత్ కార్యాలయం బాట పట్టారు. ముదినేపల్లి మండలంలో రీ వెరిఫికేషన్ అనంతరం 91 మంది దివ్యాంగుల పెన్షన్లను రద్దు చేస్తూ ఎంపీడీవో జారీ చేసిన నోటీసులు అందుకున్న పెన్షన్ దారులు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో తాము అర్హులమేనని పేర్కొంటూ అధికారులకు అప్పీలు చేశారు. మండలంలోని సుమారు 30 మంది అప్పీలుకు సంబంధించిన అర్జీలను బుధవారం మండల పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారి రమణారావు, ఇతర సిబ్బందికి అందజేశారు. దివ్యాంగ పెన్షన్ల రద్దు నోటీసులు అందుకున్న వారిలో ఎక్కువ మంది అంధత్వం కలిగిన వారే కనిపించారు. కొంతమంది అంగవైకల్యం కలిగిన వారు ఉన్నారు. రీ వెరిఫికేషన్‌లో వైద్యులు 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉందని సదరం సర్టిఫికెట్ ఇవ్వటంతో పలువురు అర్హత ఉన్న వికలాంగులు కూడా పెన్షన్లు కోల్పోయినట్లు తెలుస్తున్నది.

ఉప్పుటేరు ఆక్రమణల తొలగింపు

కైకలూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఉప్పుటేరు ఆక్రమణలను తొలగిస్తున్నారు. బుధవారం కైకలూరు మండలం ఆలపాడు శివారు ఉప్పుటేరులో ఆక్రమణల తొలగింపు పనులను తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, రాష్ట్ర వడ్డీ సాధికార సమితి కన్వీనర్ బలే ఏసురాజు పర్యవేక్షించారు. ఉప్పుటేరులో ఆక్రమణల వల్ల కుంచించికుపోయిందని దిగువకు నీరు పూర్తిస్థాయిలో పారుదల అయ్యేలా ఆక్రమణలు తొలగిస్తున్నామన్నారు. అలాగే ఉప్పుటేరు రోడ్డు, రైల్వే వంతెనల వద్ద దట్టంగా పెరిగిన గుర్రపుడెక్కను తొలగిస్తున్నారు. దీంతో కొల్లేరులోని వరదనీరు ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి చేరుతుందన్నారు.

పంట నమోదుతోనే పథకాల వర్తింపు


రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పిస్తున్న ఏవో చాముండేశ్వరి

ముసునూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వ పథకాలు పొందాలంటే తాము సాగు చేస్తున్న పంటను నమోదు చేయించుకోవాలని ఏవో చాముండేశ్వరి అన్నారు. బుధవారం చెక్కపల్లి, చింతలవల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి వరి పంటలను పరిశీలించారు. వరిపంట దుబ్బు చేసే దశ నుంచి చిరుపొట్ట దశలో ఉన్నప్పుడు కాండం తొలిచే పురుగు నివారణకు వేప కషాయం లేదా వేపనూనె 1500 పీపీఎం మూడు లీటర్లకు లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని ఏవో సూచించారు. అధికంగా యూరియా వాడటం వల్ల చీడపీడలు పెరిగి సాగుపెట్టుబడి అధికం అవుతుందన్నారు. నానో యూరియా, నానో డీఏపీని ఎకరానికి 500 మిల్లీలీటర్ల చొప్పున వాడుకుంటే 50 కేజీల యూరియాతో సమానమని అవగాహన కల్పించారు. కౌలు గుర్తింపు కార్డులు, ఈ-క్రాప్ నమోదుపై వివరించారు. స్థానిక టీడీపీ నాయకులు, రైతులు, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.



ఫ్యాప్టో మహాధర్నాను జయప్రదం చేయాలి

ముదినేపల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ సౌకర్యం వర్తింపజేయాలన్న డిమాండ్‌తోపాటు విద్యా రంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 25న విజయవాడలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో జరగనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు కోరారు. బుధవారం ముదినేపల్లిలోని మండల రిసోర్స్ సెంటర్ వద్ద మహాధర్నా పోస్టర్‌ను ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని ఫ్యాప్టో మండల నాయకులు దండే వెంకటరత్నం, కృపాకర్, ముండూరు సాయిలక్ష్మి, ఐ.దుర్గా ప్రసాద్, వల్లూరు సత్యనారాయణ, ఎస్. నాగేశ్వరరావు, పుట్టి గణేష్, నాగరాజకుమార్, రమేష్ బాబు, దినేష్ బాబు కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ముసునూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ముసునూరు కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యుడు రెడ్డి నరసింహారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బుధవారం సొసైటీ తరఫున రూ. 10 వేలు నగదును బాధిత కుటుంబానికి సొసైటీ అధ్యక్షులు దేవినేని శ్రీధర్, నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్ అందజేశారు. ఉప సర్పంచ్ తోట శ్రీనివాసరావు, బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నక్కా యోహాను, డైరెక్టర్ గోగం కాటంరాజు, సొసైటీ కార్యదర్శి దాసిరెడ్డి లక్ష్మణరావు పాల్గొన్నారు.

మానవత స్టీలు గ్లాసుల పంపిణీ



మండవల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిర్మూలనలో భాగంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండవల్లి శాఖ ఆధ్వర్యంలో మండవల్లిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు స్టీలు గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు గుడివాడ గణేష్ మాట్లాడుతూ సమాజ హితమే మానవత అభిమతం అని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో స్టీలు గ్లాసులు వాడేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ డాక్టర్ సుధాబత్తుల విజయకుమార్, ముళ్లపూడి సత్తిబాబు, బొల్లంపల్లి కృష్ణారావు, కూనపురెడ్డి కోటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	117, 125, 136
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కిన్‌లెస్	232

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

నూజివీడు, దెందులూరుకు
సాగర్ జలాలు


పాడేరు వద్ద సాగర్ ఎడమ కాలువకు గండిపడిన చోట మరమతు పనులు

నూజివీడు, ఆగస్టు 20, (ఆంధ్రజ్యోతి): సాగర్ ఎడమ కాలువ కింద 2.25 లక్షల ఆయకట్టు ఉంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని కొన్ని మండలాలలో పాటు ఏలూరు జిల్లా నూజివీడు, దెందులూరు నియోజకవర్గాల పరిధిలో సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు ఉంది. ఈనాడు తెలంగాణ నుంచి హక్కుగా రావాల్సిన నీరు ఏనాడు ఈ ఆయకట్టుకు అందలేదు. ఏటా జరిగే తంతులో భాగంగానే ఏడాది సాగర్ నీరు తెలంగాణ నుంచి వదిలారు. తెలంగాణ ప్రాంతంలోని పాడేరు వద్ద గతంలో సాగర కాలువకు గండిపడిన చోట గట్టు పటిష్టంగా లేదని, పూర్తి సామర్థ్యం మేర నీరు కాలువలో వదలలేకపోతున్నామని తెలంగాణ ఇరిగేషన్ శాఖ అధికారులు రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథికి రెండు రోజుల క్రితం తెలిపారు. ప్రస్తుతం ఈ కాలువలో 700 క్యూసెక్కుల నీరు మాత్ర మే వదిలారు. నిబంధనల ప్రకారం 1500 క్యూసెక్కుల నీరు వదలవలసి ఉంది. కాలువ గట్టు బలహీనం పేరు తో కేవలం 700 క్యూసెక్కుల నీరు మాత్రమే వదలడంతో సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు ప్రాంతంలోని ఉమ్మడి కృష్ణ, ఏలూరు జిల్లాల ప్రాంత మెట్ట రైతులకు నీరందని పరిస్థితి ఉంది. పరిస్థితి గమనించి మంత్రి పార్థసారథి నూజివీడు నియోజకవర్గం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ బాలకృష్ణతో పాటు సాగర్ అధికారులను తెలంగాణలో బలహీనంగా ఉన్న గట్టు వద్దకు పంపి తన సొంత నిధు లు రూ.1.3 లక్షలు వెచ్చించి గండి మరమ్మతులు చేపట్టారు. బలహీనంగా ఉన్న గట్టును పటిష్టంగా చేశామని స్వయంగా చూసి పూర్తి సామర్థ్యం మేరకు నీరు విడుదల చేయాలని సాగర్ అధికారులను మంత్రి కోరారు. దీంతో ఈకాలువకు 1500 క్యూసెక్కుల నీరును సాగర్ తెలంగాణ అధికారులు విడుదల చేశారు. రెండు మూడు రోజుల్లో చాట్రాయి, నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి మండలాలకు సాగర్ నీరందుతుంది.

అధికారులు సమయపాలన పాటించాలి


చాట్రాయిలో ప్రజలతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వినూత్న

చాట్రాయి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు సేవలందించాలని నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న ఆదేశించారు. చాట్రాయి తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో పంటల సాగు వివరాలు, అన్నదాత సుఖీభవ అమలు, గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులు, ఎరువులు సరఫరా, పీహెచ్‌సీల్లో మందుల సరఫరా, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వ్యాక్సినేషన్, సీజనల్ వ్యాధుల పరిస్థితి, గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణ, పారిశుధ్య నిర్వహణ, పాఠశాలలో విద్యాబోధన, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరీక్షల ఫలితాలు, ఉద్యాన పంటల సాగు, రైతులకు అందుతున్న రాయితీలు, సాగునీటి చెరువుల వివరాలు, సాగు, తాగునీరు వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలలో రికార్డు రూములు పరిశీలించి వెంటనే శుభ్రం చేయాలని ఆదేశించారు. ఇన్‌చార్జీ తహసీల్దార్ నాయక్, సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరెడ్డి, ఏవో శివశంకర్, ఎంఈవో బ్రహ్మచారి, హెచ్‌ఓ హేమ, ఈవోపీఆర్‌డీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ దుష్ప్రచారాన్ని మానుకోవాలి

ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్

కైకలూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ దుష్ప్రచారం వల్ల రాష్ట్రానికి తీరని నష్టం జరిగిందని ఇకపైన తీరు మార్చుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన కైకలూరులో విలేకర్లతో మాట్లాడుతూ రాజధానిలో గుంతల్లో నీటిని చూపించి అమరావతి మునిగి పోయిందని వైసీపీ అసత్యపు ప్రచారాలు చేస్తుందని వారి ప్రవర్తనతో రాష్ట్రానికి జరిగిన అన్యాయం తీరనది అన్నారు. వైసీపీ నడవడిక వల్ల సింగపూర్ ప్రతినిధులు ఆంధ్రాకు వచ్చేందుకు సుముఖత చూపటం లేదని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, నారా లోకేశ్ వారిని ఒప్పించి అమరావతికి తీసుకువస్తున్నారన్నారు. గత ఐదు సంవత్సరాల్లో దెబ్బతిన్న రాష్ట్రం అందరి సహకారంతోనే అభివృద్ధి చెందుతోందని, వైసీపీ నాయకులు మంచి చేయకపోయినా చెడు మాత్రం చేయవద్దని సూచించారు. అభూత కల్పనలతో ప్రజలను తప్పుదారి పట్టించద్దని రాష్ట్రంపై వైసీపీ ఎందుకు కక్షగట్టిందో అర్థంకావడం లేదన్నారు.

చదువుకు పేదరికం అడ్డు కాకూడదు : నితిన్ కృష్ణ


ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న మంత్రి సారథి కుమారుడు నితిన్ కృష్ణ

చాట్రాయి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): చదువుకు పేదరికం అడ్డు కాకూడదని. ప్రభుత్వం, దాతలు అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి కుమారుడు నితిన్ కృష్ణ ఉద్బోధించారు. మండలంలోని పోలవరం జడ్పీ హైస్కూల్లో నూరుశాతం పాఠశాలకు హాజరైన 15 మంది విద్యార్థులకు రూ.5000 చొప్పున రూ.75 వేల నగదు ప్రోత్సాహకాలను మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు మరిడి వెంకటేశ్వరరావు (చిట్టిబాబు) ప్రకటించగా, బుధవారం నితిన్ కృష్ణ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఎంఈవో-1 ఎం. శ్రీను, హెచ్‌ఎంలు శ్రీనివాసరావు, ఆర్. నాగేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, తేళ్లూరి శేఖర్, పీఏసీఎస్ అధ్యక్షుడు యర్రా ప్రసాదరావు, తమ్మిలేరు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ యర్రా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలరావమ్మ ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం



ఆగిరిపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తోటపల్లిలోని దుగ్గిరాల బాలరావమ్మ ఆలయ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం బుధవారం ఆలయ ప్రాంగణంలో జరిగింది. చైర్మన్‌గా మండవ రామకృష్ణ, కమిటీ సభ్యులుగా రెబ్బ వెంకట నాగ రాజశేఖర్, వీరంకి వెంకటరత్నం, పామర్తి నాగలక్ష్మి, వేములూరి మాధవి, మోచర్ల శివ నాగేశ్వరమ్మ, పొన్నం రజని కుమారి, రాణిమేకల శ్రీనివాస్‌రావు, మల్లపల్లి శివరామ్ ప్రసాద్‌తో ఆలయ ఈవో సీహెచ్ సాయి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఛైర్మన్, సభ్యులు మాట్లాడుతూ అందరి సహకారంతో ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తామని అన్నారు. ఆరేపల్లి శ్రీనివాసరావు, నక్కనబోయిన వేణు, కొల్లిపర సాంబశివరావు, కాప శ్రీనివాసరావు, విక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కేటాయింపు పెంచాలి

ముదినేపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరతను ప్రభుత్వం పరిష్కరించాలని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ముదినేపల్లి మండల శాఖ అధ్యక్షుడు బండారు పాండురంగారావు కోరారు. సొసైటీలకు సరఫరా చేస్తున్న యూరియా అరకొరగానే ఉందని, ప్రస్తుతం సార్వా వరిపైరు ఎదుగుదలకు యూరియా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముదినేపల్లి మండలానికి సుమారు 130 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, తక్కువగా కేటాయిస్తున్నారని తెలిపారు.

నాణ్యమైన 'భోజనం' అందించాలి

ముసునూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన ఆహారాన్ని అందించాలని మండల విద్యాశాఖ అధికారి బీవీఎస్ సుబ్బారావు సూచించారు. బుధవారం గోపవరంలోని మోడల్ ప్రైమరీ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులతో పాటు మరుగుదొడ్లు, తాగునీరు తదితర సౌకర్యాలను పరిశీలించారు. విద్యాబోధన, మధ్యాహ్న భోజనం నాణ్యత, రుచిపై విద్యార్థులను ఆరా తీశారు. వారితో కలిసి భోజనం చేసి నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు సులభ పద్ధతుల్లో విద్యాబోధన చేసి, వారి భవిష్యత్‌కు బాటలు వేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.



ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ఆగిరిపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): చూపులేకుంటే జీవితం అంధకారమవుతుందని, అందుకే సంధ్య ఐ హాస్పిటల్స్ ఎప్పటికప్పుడు ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడంలో ముందుంటుందని ఆ ఆసుపత్రుల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ భార్గవ్‌రామ్ అన్నారు. బుధవారం ఆగిరిపల్లి గ్రామ సచివాలయం ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఆర్ కాశీరాజు యాదవ్ ప్రజలకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో మొత్తం 110 మంది పరీక్షలు చేయించుకోగా, 15 మందికి సర్జరీలు పడతాయని, 20 మందికి ఆప్టికల్స్ సూచించగా, ఆపరేషన్ సూచించిన వారికి ఉచితంగా కంటి శుక్లముల ఆపరేషన్ చేయబడును అని అన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ చౌటపల్లి లక్ష్మీ విక్టర్‌బాబు, మేనేజర్ వి శివకుమార్, అసిస్టెంట్ మేనేజర్ మల్లికార్జున్, అనిల్‌కుమార్, రమేష్, హేమసుందర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ దంపతులకు తీపి కబురు..

టీచర్ల అంతర్ జిల్లా బదిలీలకు గ్రీన్ సిగ్నల్

వేర్వేరు జిల్లాల్లో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ దంపతులకు, సొంత జిల్లాకు వెళ్లాలనుకునే సింగిల్ టీచర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. వివిధ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగ దంపతులు ఇక మీదట ఒకే జిల్లాలో పనిచేసేలా ఒక చోటకు చేర్చేందుకు ఉద్దేశించిన అంతర్ జిల్లాల స్పౌజ్, మ్యూచువల్ బదిలీలకు పాఠశాల విద్యాశాఖ బుధవారం మార్గదర్శకాలను, షెడ్యూలును ప్రకటించింది.

ఏలూరు అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): చిరకాలంగా వేరే జిల్లాల్లో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ దంపతులకు ఇది ఊరట కలిగించే విషయం. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి తమ జీవిత భాగస్వామి వద్దకు బదిలీపై వెళ్లేందుకు లేదా ఇతర జిల్లాల నుంచి ఇక్కడకు వచ్చేందుకు మార్గం సుగమమైంది. వేర్వేరు జిల్లా ల్లో ఒకే కేటగిరీ, సబ్జెక్టు, మేనేజ్‌మెంట్‌లో పనిచేస్తున్న ఇరువురు సింగిల్ ఉపాధ్యాయుల పరస్పర బదిలీకి అవకాశం కల్పించారు.

స్పౌజ్, మ్యూచువల్ బదిలీలు వీరికే..

ఈ ఏడాది జూలై 31వ తేదీ నాటికి కనీసం రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ప్రభుత్వ/ జడ్పీ/ మున్సిపల్/ నగర పాలక సంస్థ యాజమాన్యాల ఉపాధ్యాయులు, ప్రధానో పాధ్యాయులు అంతర్ జిల్లాల బదిలీకి దరఖాస్తు చేసుకునేందుకు అర్హులే. ఆ మేరకు ఉపాధ్యాయుని జీవిత భాగస్వామి (స్పౌజ్) రాష్ట్ర/ కేంద్ర ప్రభుత్వ లేదా రాష్ట్ర/ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, విశ్వవిద్యాలయాలు, శాఖాధిపతులు, స్థానిక సంస్థల్లో పనిచేస్తున్నట్టయితే అంతర్ జిల్లా బదిలీని అభ్యర్థించవచ్చు. బదిలీ అయిన నూతన జిల్లాలో సీనియార్టీ జాబితాలో చివరన ఉండటానికి అభ్యంతరం లేదని దరఖాస్తుదారు తన అంగీకారాన్ని ముందుగానే తెలపాలి. జీవిత భాగస్వామి వద్దకు బదిలీ కోరుకునే ఉపాధ్యాయునికి సంబంధిత జిల్లాలో నిర్దీత కేటగిరీ, ఒకే మేనేజ్‌మెంట్‌లో క్లియర్ వెకెన్సీ అందుబాటులో ఉంటేనే బదిలీ అభ్యర్థనకు అర్హత ఉంటుంది. ఇవే నియమాలు వేర్వేరు జిల్లాల సింగిల్ టీచర్ల పరస్పర బదిలీలకు వర్తిస్తాయి. ఆ ప్రకారం పరస్పర బదిలీ కోరుకునే టీచరు అదే కేటగిరీ, సబ్జెక్టు, మేనేజ్‌మెంట్, క్లియర్ వెకెన్సీలో పనిచేస్తున్న వేరే జిల్లా ఉపాధ్యాయుని మధ్యే జరుగుతుంది. అనధికారికంగా స్కూలు విధులకు గైర్హాజరవుతున్న టీచరు, సస్పెన్షన్‌లో ఉన్న ఉపాధ్యాయులకు అంతర్ జిల్లాల బదిలీలు వర్తించవు.

నేటి నుంచే ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

తాజా ఉత్తర్వుల నేపథ్యంలో గతంలో అంతర్ జిల్లాల బదిలీ కోసం ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలన్నీ రద్దయినట్టేనని, ఆ మేరకు కొత్తగా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని విద్యా శాఖ సూచించింది. నిర్దీత మార్గదర్శకాల మేరకు అంతర్ జిల్లాల బదిలీకి అర్హతలున్న స్పౌజ్, మ్యూచువల్ కేటగిరీ ఉపాధ్యాయులంతా లీప్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకుని, అప్లికేషన్ ప్రింటవుట్‌ను, సంబంధిత డాక్యుమెంట్లు/ సర్టిఫికెట్లను జత చేసి సంబంధిత మండల విద్యా శాఖాధికారికి అందజేయాలి. వాటిని తమ వద్ద వున్న ఒరిజినల్ రికార్డులతో ఎంఈవో/ డీవైఈవో/ హెచ్‌ఎం సరిపోల్చుకుని ధ్రువీకరించు కోవాలి. దరఖాస్తుల స్వీకరణ గురువారం నుంచి ఈ నెల 24 వరకు ఉంటుంది. దరఖాస్తు ప్రింటవుట్ల పరిశీలనను 22 నుంచి 25 లోగా ఎంఈవోలు పూర్తి చేసి, 26లోగా డీఈవో వెరిఫికేషన్ నిమిత్తం అందజేస్తారు. వాటిని డీఈవోలు విద్యాశాఖ డైరెక్టర్‌కు 27న అందజేయాలి. తుది పరిశీలన, ఫైనలైజేషన్ ప్రక్రియలను 28, 29 తేదీల్లో డైరెక్టరేట్‌లో పూర్తి చేసి, స్పౌజ్, మ్యూచువల్ బదిలీలకు అర్హుల తుది జాబితాను 30న ప్రభుత్వానికి సమర్పిస్తారు. బదిలీల ఖరారుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది.

గోదావడి వడిగా..

(5వ పేజీ తరువాయి)

అన్ని ఏర్పాట్లు చేశాం. విపత్తులశాఖ ఇచ్చే సూచనలతో ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. పునరావాస కాలనీల్లో 30 టాయిలెట్లను సిద్ధం చేశాం. ఇప్పటికే 9 మోటార్లు ద్వారా పనిచేసే బోర్ల ద్వారా తాగునీటిని అందించ డానికి సిద్ధం చేశాం. వైద్యబృందాలను ఏర్పాటు చేశాం. విద్యుత్, రవాణా సౌకర్యాలకు అన్ని చర్యలు తీసుకున్నాం. శాశ్వత ప్రాతిపదికన ముంపు మండ లాల ప్రజల కోసం తాజాగా కాలనీల్లో ఏర్పాట్లకు రోడ్లు, ఇతర సౌకర్యాలకు టెండర్లు పిలిచాం'అని తెలిపారు.

కొల్లేరు ఉప్పుటేరు ఆక్రమణల తొలగింపు..

కొల్లేరు పరీవాహక ప్రాంతంలో ఉప్పుటేరు నుంచి వరదనీరు బయటకు పోయేందుకు వీలుగా ఆయా పరిసర ప్రాంతాల్లో ఆక్రమణలు, గుర్రపుడెక్క తూడు తొలగింపు పనులు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. సుప్రీం సాధికారిక కమిటీ ఆదేశాల మేరకు ఉప్పుటేరు వరద నివారణకు అన్ని చర్యలను చేపట్టామన్నారు. ఇక మీదట బడ్జెట్‌ను రూపొందించి నిరంతరాయంగా పనులు చేస్తామన్నారు. డీఆర్వో విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లాలో కొనసాగుతున్న వర్షాలు

ఏలూరు సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీరం దాటినా జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. గత 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా కుక్కునూరు మండలంలో 28 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కాగా సరాసరి వర్షపాతం 3.9 మి.మీ నమోదైంది. వేలేరుపాడు 27.4, భీమడోలు 7.8, పోలవరం 4.6, జీలుగుమిల్లి 4, బుట్టాయిగూడెం 4, లింగపాలెం 3.8, ముసునూరు 3.2, నిడమర్రు 3 మి.మీ వర్షపాతాలు నమోద య్యాయి. జిల్లాలో వర్షం కురిసిన మిగిలిన మండలాల్లో మూడు మిల్లీ మీటర్లు కన్నా తక్కువగా వర్షపాతం నమోదైంది.


మంత్రి నారాయణను కలసిన అమరావతి బ్రాండ్ అంబాసిడర్ వైష్ణవి

వైష్ణవికి మంత్రి నారాయణ ప్రశంస

ముదినేపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణానికి నిధుల సేకరణలో తన వంతు కృషి చేస్తున్న ముదినేపల్లికి చెందిన అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవిని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అభినందించారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం మంత్రి నారాయణను తన తండ్రి డాక్టర్ మనోజ్‌తో పాటు వైష్ణవి కలిశారు. అమరావతి రాజధాని నిర్మాణానికి నిధుల సేకరణలో అన్ని వర్గాల ప్రజలకు భాగస్వామ్యం కల్పించేందుకు రూ. 116 మాత్రమే విరాళం ఇవ్వాలని కోరుతున్నామని, అందుకు మంచి స్పందన కూడా వస్తున్నదని మంత్రికి వైష్ణవి వివరించారు. దాతలు తమ విరా ళాలను ఇచ్చేందుకు ఏపీ సీఆర్‌డీఏ క్యూఆర్ కోడ్ సౌకర్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువెళ్లామని తెలపగా అంబాసిడర్‌గా చేస్తున్న కృషిని మంత్రి ప్రశంసిస్తూ వైష్ణవికి సహకరిస్తున్న ఆమె తండ్రి మనోజ్‌ను మంత్రి అభినందించారు. కైకలూరు నియోజకవర్గానికి ఏలూరు జిల్లా నుంచి కృష్ణా జిల్లాలో కలపాలని కూడా కోరగా ప్రజలకు సౌకర్యం ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి నారాయణ హామీ ఇచ్చారని వైష్ణవి తెలిపారు.

పాండువ్వ శ్రీనుకు అభినందన




ముదినేపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు టూర్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే మంతెన సత్యనారాయణరాజు (పాండువ్వ శ్రీను)ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ముదినేపల్లి మండలం వైవాకకు చెందిన నాగేంద్రకుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. అమరావతిలో ఆయన్ని సత్కరించారు. నిబద్ధత కలిగిన నాయకుడికి బాధ్యతతో కూడిన హోదా కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు.

క్రైమ్ కార్నర్

వివాహిత ఆత్మహత్య

ఆగిరిపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో భార్య ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆగిరిపల్లి మండలం చిన్న ఆగిరిపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ కె శుభశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం చిన్న ఆగిరిపల్లి గ్రామానికి చెందిన జగన్నాథం రాముకు, కృష్ణా జిల్లా కూచిపూడి గ్రామానికి చెందిన వెంకట సోనియా (28)కు 2020లో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. పుట్టింటికి వెళ్ళిన సోనియా ఆదివారం వస్తానని భర్తకు ఫోన్ చేసి చెప్పింది. అయితే ఆమె సోమవారం వచ్చినందున భార్యాభర్తలు గొడవ పడ్డారు. తనతో భర్త మాట్లాడకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై సోనియా మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


సింగరాజుకుంటలో ఉన్న వ్యవసాయ బోర్ల రాగి వైర్లు, కేబుల్

కేబుల్ వైర్లు స్వాధీనం

ముసునూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ముసునూరు సింగరాజుకుంటలో వ్యవసాయ బోర్లకు సంబందించిన కేబుల్ వైర్లు బుధవారం బయటప డ్డాయి. ఒక తుప్పచాటున కేబుల్ వైర్లు గుట్టగా ఉండటం చూసి పశువుల కాపరులు టీడీపీ నాయ కుల ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసు లు వచ్చి వాటిని స్వాధీనం చేసుకున్నారు. పక్కనే కొన్ని కేబుల్ వైర్లను కాల్చి వాటిలోని రాగి వైర్‌ను అపహరించినట్టు గుర్తించారు. ఇటీవల ముసునూరులో సూమారు 10 వ్యవసాయ బోర్లకు సంబంధించి రూ. 1 లక్షా 50 వేల విలువ గల సామగ్రిలో రాగివైర్లను దుండగులు అపహరించుకు పోయినట్లు బాధిత రైతులు తెలిపారు. దొరికిన కేబుల్ వైర్లను బట్టి ఈ చోరీల్లో స్థానికుల హస్తం ఉంటుందనే అనుమానాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. రాగివైర్ల చోరీపై జిల్లా ఎస్పీ శివకిశోర్ ఆదేశాల మేరకు ఎస్ఐ ఎం.చిరంజీవి పర్యవేక్షణలో ప్రత్యేక నిఘా పెట్టినా వ్యవసాయ బోర్ల సామగ్రి, రాగివైర్ల చోరీలు జరుగుతుండటం విశేషం. చోరీలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

బైక్‌లు ఢీ.. ఒకరికి గాయాలు

కైకలూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒక యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. కైకలూరు టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు గ్రామానికి చెందిన సోమగాని శ్రీకాంత్ ద్విచక్రవాహనంపై కైకలూరు మండలం వరహాపట్నం వస్తున్నాడు. మార్గమధ్యంలో కైకలూరు పట్టణంలోని మాగంటి సెంటర్లో ఎదురుగా ఒక బైక్‌పై ముగ్గురు యువకులు వేగంగా వస్తూ కారును తప్పించబోయి బైక్‌ను ఢీకొట్టారు. దీంతో శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్సై ఆర్. శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.